



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 138 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 09 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


## దేవరపల్లి ఘటనపై
# సీఎం సమీక్ష



**రేపటిలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**
**నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలకు ఆదేశం**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరంలోని దేవరాపల్లి ఆశ్రమం బాలుర హాస్టల్ లో విద్యార్థుల అస్వస్థత ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఓ అధికారులు, ఇతర అధికారులతో సమీక్ష చేశారు. పోలవరం జిల్లా రంపచోడవరం లోని దేవరపల్లి ఆశ్రమ బాలుర హాస్టల్ లో 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, డయేరియా లక్షణాలు కనిపించటంతో వారిని హుటాహుటిన మారేడుమిల్లి, రంపచోడవరం ఏరియా ఆస్పత్రులకు తరలించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిన్న ఉదయం అల్పాహారం తీసుకున్న తరువాత విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులు రావటంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్టు తెలిపారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి కుదుటపడిందని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే హాస్టల్ తనిఖీకి వెళ్లి అక్కడి పరిస్థితులను కూడా అధ్యయనం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలియచేశారు. హాస్టల్ లోని మిగిలిన విద్యార్థులకు కూడా ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి డయేరియా లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించినట్టు వివరించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు.... ఆహార పదార్థాలు, నీటి నమూనాలు కూడా సేకరించామని తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేసేందుకు జాయింట్ ఇనస్పెక్షన్ కమిటీని కూడా నియమించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ రంప చోడవరం ఏరియా అస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై తనకు నివేదించాలన్నారు. ఘటనపై రేపటి లోగా పూర్తి నివేదికను తనకు అందజేయాలని కలెక్టర్ ను అదేశించారు. ఘటనకు కారకులపై శాఖా పరమైన చర్యలతో పాటు అవసరాన్ని బట్టి క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు.

## డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడేతో
# ఏపీకి ప్రయోజనం
### కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌తో ఏపీకి అనేక ప్రయోజనాలు కలగనున్నాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే ఇస్తున్నారని.. దీంతో ఏపీకి ప్రయోజనం చేకూరనుందని చెప్పారు. ఉద్యోగాలు పెరుగుతాయని.. తద్వారా అనేక డేటా సెంటర్లు రాష్ట్రానికి వచ్చే అవకాశముంటుందన్నారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా అధిక శాతం నిధులు ఏపీకి వచ్చేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కృషితో ఎన్నో అద్భుత కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన

మిగతా .. 2లో..

## ఉగ్రవాదంపై
# భారత్ రాజీ పడదు
### ప్రధాని నరేంద్ర మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉగ్రవాదంపై భారత్ రాజీ పడదని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. మలేషియా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రక్షణ, జాతీయ భద్రత, సెమీకండక్టర్లు, వాణిజ్యం సహా పలు అంశాలపై చర్చలు జరిపారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ మలేషియాతో భారత్‌కు

మిగతా .. 2లో..

## రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్
# భాగవత్ కీలక వ్యాఖ్యలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** తన రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా పనిని కొనసాగించాలని సంఘ్ తనను కోరిందన్నారు. ఒకవేళ దిగిపోవాలని ఆదేశిస్తే..

మిగతా .. 2లో..

## రేవంత్‌ను కేసు నుంచి తప్పించడానికే
# ల్యాబ్ తగులబెట్టారు
### భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**హనుమకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో అగ్ని ప్రమాదం కావాలనే చేశారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హనుమకొండలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఎఫ్ఎస్ఎల్ అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్రప్రజలకు ఎన్నో అనుమానాలు ఉన్నాయని, అసలు నేరస్థులు ఎవరో తేలాలంటే రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. "ఓటుకు నోటు కేసు నుంచి రేవంత్‌ను తప్పించడానికే ల్యాబ్ తగులబెట్టారు. అందరూ మున్సిపల్

మిగతా .. 2లో..

## కృష్ణమ్మ ఒడిలో కవితా నీరాజనం..
# కవులే సమాజానికి మార్గదర్శకులు




- కృష్ణా తీరం కవితా హారం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్
- రాష్ట్రవ్యాప్త నదీ తీరాల్లో ఇలాంటి సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చూడతామని హామీ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి ఒడిలో సాగే సాహిత్య సమ్మేళనాలు సమాజానికి కొత్త దిశానిర్దేశం చేస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ భవానిపురం సమీపంలోని హరిత బెర్మ్ పార్కు వద్ద ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, ఏపీ పర్యాటక శాఖ,

మిగతా .. 2లో..

## ఆ నివేదికను తొక్కిపెట్టి కల్తీ కొనసాగింపు
# క్షమించరాని నేరం
### మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ హయాంలో తిరుమల లడ్డూ కల్తీ జరుగుతోందని తెలిసి కూడా వైకాపా ఉపేక్షించడం పెద్ద నేరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరాన్ని కప్పిపుచ్చి అదే సంస్థలకు టెండర్లు కొనసాగించడం ముడుపుల కోసమేనని విమర్శించారు. "నెయ్యి కొనుగోలు టెండర్లు సడలించి అవినీతికి

మిగతా .. 2లో..

## కాసుల కక్కుర్తితో..
# కలియుగ దైవానికే అపచారం

**జంతువుల కొవ్వు, రసాయనాలతో నెయ్యి తయారీ**
**దాన్ని శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగించడం దారుణం**
**వీడియో సందేశంలో ఎంబార్ జీయర్ స్వామి**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సమస్త సృష్టిని పాలిస్తూ మనల్ని రక్షించే వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలలో ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి వాడటం పరమ అపచారమని తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌కు చెందిన ఎంబార్ జీయర్ స్వామి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో డబ్బు ఆశతో ఇలాంటి దారుణానికి ఒడిగట్టారన్నారు. తిరుమలలో లడ్డూ ప్రసాదం తయారీకి జంతు కొవ్వు, రసాయనాలతో తయారు చేసిన మిశ్రమాన్ని

మిగతా .. 2లో..

## మహిళ కంపార్ట్‌మెంట్‌లో
# ఆగంతుకుడు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ముంబయిలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. రద్దీగా ఉండే లోకల్ ట్రైన్‌లో ఓ ఆగంతుకుడు బురఖా ధరించి మహిళ కంపార్ట్‌మెంట్‌లోకి చొరబడటం కలకలం రేపింది. నిందితుడి అసాధారణ ప్రవర్తనతో మహిళ ప్రయాణికులు వెంటనే

మిగతా .. 2లో..

## సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే
# ఏ నిర్ణయమూ తీసుకోం..
### తెలంగాణా ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి



**గణపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే ఏ నిర్ణయమూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొందరు ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని, మెడికల్ బోర్డు విషయంలో విషం చిమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. పుర ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. రేగొండ మండలం కొడవటంచ చేరుకున్న సీఎం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి, పక్కనే ఉన్న బాలాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రూ.12.15 కోట్లతో

మిగతా .. 2లో..

## మానవత్వం చాటిన విజయవాడ
# ట్రాఫిక్ పోలీసులు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ట్రాఫిక్ పోలీసులు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది మూగ జీవాలను కాపాడి మానవత్వం చాటుకున్నారు. బీఆర్‌టీఎస్ ఫుడ్ జంక్షన్ సమీపంలోని డ్రెయినేజీలో ప్రమాదవశాత్తు పడిపోయి చిక్కుకుపోయిన రెండు ఎద్దులను రక్షించారు. స్థానికుల నుంచి ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే త్రీటౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది స్పందించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించారు. రెండు శాఖల సిబ్బంది సమన్వయంతో ఘటనా స్థలానికి క్రేన్ తీసుకొచ్చి.. ఎలాంటి గాయాలు కలగకుండా ఎద్దులను సురక్షితంగా బయటకు తీశారు. సకాలంలో స్పందించి మానవత్వం చాటిన ట్రాఫిక్ పోలీసులు, వీఎంసీ అధికారులు, సిబ్బందిని స్థానికులు అభినందించారు.

## డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ..
# 'నక్సలిజం'పై అమిత్ షా కీలక భేటీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెడతామని కేంద్రం ప్రకటిస్తూ వస్తోంది. ఈ డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ.. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించారు. వామపక్ష తీవ్రవాదంపై పోరాటంలో భాగంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "భద్రతా వ్యూహాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌లను దెబ్బతీయడం, లొంగుబాటు పాలసీల వంటివి నక్సలిజంపై పోరాటంలో సత్ఫలితాలు ఇచ్చాయి" అని అమిత్ షా తెలిపారు. నిర్దేశించుకున్న గడువులోపు నక్సలిజాన్ని నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్,

మిగతా .. 2లో..

## కాంగ్రెస్, బీఆర్ఎస్..
# రెండు పార్టీలు ఒక్కటే
### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



**నల్గొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కాంగ్రెస్‌కి ఓటేసినా.. బీఆర్ఎస్‌కు వేసినా ఒక్కటేనని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఎద్దేవా చేశారు. ఒకరు దొంగ అయితే.. మరొకరు దోపిడీ దొంగ అని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అదే భాజపా నేతలు ఓడినా.. గెలిచినా ఒకే పార్టీలో ఉంటారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. నల్గొండ క్లాక్ టవర్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ఎన్నికల విజయ సంకల్ప సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా .. 2లో..

## ఆ వీడియోకు నేను
# క్షమాపణ చెప్పను
### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఆయన భార్యను పరిహసించేలా ఉన్న వీడియోను తొలగించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఈ వీడియోను ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు. దీనిపై భారీ ఎత్తున విమర్శలు చెలరేగాయి. 2020 అధ్యక్ష ఎన్నికల సమయంలో కీలక రాష్ట్రాల్లో ఓటింగ్ యంత్రాలను ఉద్దేశపూర్వకంగా టాంపరింగ్ చేశారని ఉందని.. అందుకే ఆ వీడియోను పోస్టు చేశానని చెప్పారు. తాను ఏ తప్పూ చేయలేదని, క్షమాపణ చెప్పబోనని ఆయన స్పష్టంచేశారు. "2020 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఓటింగ్ యంత్రాలను ట్యాంపరింగ్ చేశారని ఉన్న ఆ వీడియో నాకు నచ్చింది. అందుకే దాన్ని నేను వెంటనే పంపించాను. చివరి వరకు చూడలేదు. విషయం తెలిసిన తర్వాత దాన్ని తొలగించాం" అని ట్రంప్ పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

### ఉగ్రవాదంపై
# భారత్ రాజీ పడదు

ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. ఇరు దేశాలు విభిన్న రంగాల్లో సంబంధాలను మరింత శక్తిమంతం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. "ఉగ్రవాదంపై మా సందేశం స్పష్టంగా ఉంది. ఈ విషయంలో ద్వంద్వ వైఖరి, రాజీ వైఖరికి చోటు లేదు. భారత్–మలేషియా సముద్ర సరిహద్దులు పంచుకుంటున్నాయి. ఇరు దేశాల ప్రజల మధ్య లోతైన ఆత్మీయ బంధం ఉంది. ఇండో పసిఫిక్ ప్రాంతం ప్రపంచానికి వృద్ధి యంత్రంగా మారింది " అని పేర్కొన్నారు. భారత్–మలేషియా మధ్య ఆరు కీలక ఒప్పందాలు జరిగాయి. అంతకు ముందు కౌలాలంపుర్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది.

### రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్
# భాగవత్ కీలక వ్యాఖ్యలు

వైదొలగేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఆరెస్సెస్ చరిత్రలో ఇంతవరకు ఎవరినైనా పదవీ విరమణ చేయించాల్సిన పరిస్థితి రాలేదన్నారు. "ఆరెస్సెస్ చీఫ్ పదవికి ఎన్నికలు ఉండవు. రీజినల్, డివిజనల్ అధిపతులు సర్‌సంఘ్‌చాలక్‌ను నియమిస్తారు. సాధారణంగా 75 ఏళ్లు నిండిన తర్వాత ఎలాంటి పదవిలో లేకుండా పని చేయాలంటారు. నాకు 75 ఏళ్లు నిండాయి. ఈ విషయాన్ని సంఘ్‌కు తెలియజేశాను. కానీ.. యథావిధిగా కొనసాగాలని కోరింది. పదవి నుంచి వైదొలగాలని ఎప్పుడు కోరినా.. సిద్ధంగా ఉన్నాను. కానీ, పని నుంచి మాత్రం ఎప్పటికీ విరమణ ఉండదు" అని భాగవత్ చెప్పారు. చివరి రక్తపు బొట్టు వరకు స్వయంసేవకుల నుంచి సంఘ్ పని చేయించుకుంటుందని సరదాగా వ్యాఖ్యానించారు. వీర్ సావర్కర్‌కు భారతరత్న పురస్కారం ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ అన్నారు. దేశ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా భారత్– అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు భావిస్తున్నానని చెప్పారు. అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకొని 'ఉమ్మడి పౌరస్మృతి' రూపొందించాలని, అది విభేదాలకు దారితీయకూడదని పేర్కొన్నారు. ప్రచారం చేయడం సంఘ్ పని కాదని, సంస్కారాలను పెంపొందించడమేనని తెలిపారు.

### కృష్ణమ్మ ఒడిలో కవితా నీరాజనం..
# కవులే సమాజానికి మార్గదర్శకులు

మల్లెతీగ సాహిత్య సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "కృష్ణా తీరం కవితా హారం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశతో కలిసి 'బోధిసిరి' నౌకలో ప్రయాణిస్తూ, 51 మంది కవులు వినిపించిన కవితలను ఆసక్తిగా ఆలకించారు. కృష్ణమ్మ అలల పైన కదులుతున్న పడవలో కవి సమ్మేళనం జరగడం ఒక కొత్త ఒరవడికి నాంది అని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. అమరావతి ఒడిలో ప్రవహించే కృష్ణమ్మకు ఈ తరం కవులు సమర్పించిన కవితా హారతి ఇది అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పలు కీలక అంశాలను వెల్లడించారు. త్వరలోనే నంది నాటకోత్సవాలు నిర్వహించి, నంది అవార్డులను అందజేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన సాంస్కృతిక రంగాన్ని గాడిలో పెడుతున్నామని, ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలను ఘనంగా అందజేస్తామన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మహాకవి తిక్కన విగ్రహ ఏర్పాటుపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించామని, త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.ఇదే తరహాలో పెన్నా, గోదావరి నదీ తీరాల్లో సాహిత్య కార్యక్రమాలు చేపడతామని, ముఖ్యంగా దేవీపట్నం నుండి పాపికొండలు వెళ్లే లాంచీలో త్వరలోనే కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. సమకాలీన సమాజంలోని అట్టడుగు వర్గాల ఆవేదనను ప్రతిబింబించేలా సాగిన ఈ కవితలను వీడియో డాక్యుమెంటేషన్ ద్వారా డిజిటలైజ్ చేసి భావితరాలకు అందించనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. కవులు, కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శల మధ్య ఇలాంటి సాహిత్య వేదికలు తమకు మానసిక శాంతిని, సమాజ సేవకు పునరంకితమయ్యే స్ఫూర్తిని ఇస్తాయని మంత్రి దుర్గేష్ చమత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ముంబై నుంచి వచ్చిన 51 మంది కవులను మంత్రి దుర్గేష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సంస్థ ప్రతినిధులు మరియు సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కవులు.. లోకానికి భావభానులు: కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

కవులు సమాజానికి వెలుగునిచ్చే భావభానులని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. రచయితలు, వారి రచనలను పరిరక్షించుకోవడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కళలు, సాహిత్యం మన సంస్కృతికి జీవన రేఖలని.. చెట్టు వేర్లు వంటివని.. ఇవి ఎంత బలంగా ఉంటే మన సమాజం అంత బలంగా ఉంటుందని పేర్కొన్నారు. సృజనాత్మకతకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. స్థానిక పర్యాటకాన్ని, సంస్కృతిని, కళలు, సంప్రదాయాలను ఎప్పుడూ కాపాడుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి చెబుతుంటారని పేర్కొన్నారు. రచయితలు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేస్తారని, భావజాల వికాసంలో వారి పాత్ర అనిర్వచనీయమన్నారు. కవులు, రచయితలు, రచనలు లేని సమాజాన్ని ఊహించుకోలేమని.. తెలుగు సాహిత్యాన్ని మరింతగా ప్రోత్సహించే వారందరికీ ప్రభుత్వం చేయూతగా నిలుస్తుందని.. జాతీయ సాంస్కృతిక ఉత్సవాల స్ఫూర్తితో నేడు నిర్వహించిన కృష్ణాతీరం–కవితా హారం కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహించిన మల్లెతీగ సాహిత్య సేవా సంస్థకు అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

ఏపీ సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి మాట్లాడుతూ ఒక జాతి బతకాలంటే భాష బతకాలి, సమాజం బతకాలంటే సాహిత్యం బతకాలి.. చరిత్ర అనేది రాజుల శాసనాల నుంచి కాదు.. కవుల పద్యాల నుంచి తెలుసుకున్న చరిత్రమనదని పేర్కొన్నారు. నది భూమిని సస్యశ్యామలం చేస్తుంటే, కవులు మనుషుల మనసులను సస్యశ్యామలం చేస్తారని పేర్కొన్నారు. వేమన పద్యాలు, సుమతీ శతకం అందించే జ్ఞానం ప్రపంచమంతా తిరిగినా దొరకదని, సాహిత్యం అనేది తరతరాలకు విజ్ఞాన వారధి అని పేర్కొన్నారు. మనం ఎంత ఆధునికమైన ఏఐ యుగంలో జీవిస్తున్నప్పటికీ మూలాలను మరచిపోకూడదని, భాష––సాహిత్యాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తేజస్వి స్పష్టం చేశారు. కవులు, కళాకారులను రక్షించుకోవడం ద్వారా మాత్రమే సంస్కృతి నిలుస్తుందని.. ఈ విషయంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ అహర్నిశలు కృషిచేస్తోందని, ఇలాంటి గొప్ప కార్యక్రమాలకు ఎప్పుడూ తమ సహకారం ఉంటుందని తేజస్వి పేర్కొన్నారు. సంప్రదాయాలు, విలువలు, కళలను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశగారు ప్రోత్సహిస్తున్న తీరు, ఆయన కళాత్మక హృదయం.. జీవనదీ ప్రవాహమని అన్నారు. కొండపల్లి బొమ్మలు, కళాకారుల సంక్షేమానికి కృషిచేస్తున్న తీరు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కళలు, కళాకారులను ప్రతిఒక్కరూ గౌరవించుకోవాల్సిన అవసరముందని.. ఈ విషయంలో ప్రభుత్వం ముందుంటోందని ఆమె పేర్కొన్నారు. మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు, ముఖ్యంగా సరికొత్తగా రూపాంతరం చెందిన, చెందుతున్న నేటితరం కవిత్వాన్ని కాలగర్భంలో కలిసి పోకుండా భద్రపరిచి, ముందుతరాలకు అందించేందుకు రికార్డు చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమానికి చేయూతనిచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, యేమినేని వెంకటరమణ, చొప్పా రాఘవేంద్రశేఖర్, కె.సంపత్, వై.డి.ఆనంద్, పి.చిదంబరం, బత్తిన అగస్తీశ్వరరావు, విష్ణుభొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కల్తీ నెయ్యి వినియోగించినట్టు వైవీ సుబ్బారెడ్డే అంగీకరించారు**

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డే అంగీకరించారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగించింది అసలు నెయ్యే కాదని ల్యాబ్ రిపోర్టులు ధ్రువీకరించాయని మంత్రి తెలిపారు. 2019–24 మధ్య కాలంలో వైకాపా ప్రభుత్వంలోనే ఈ మహాపాపం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అయోధ్యకు పంపిన శ్రీవారి లడ్డూల విషయాన్ని ప్రస్తావిస్తూ వారే కల్తీ నెయ్యిపై నోరుజారారన్నారు. అయోధ్యకు పంపిన లడ్డూలు వేరే చోట నుంచి తెప్పించామని, వాటి తయారీలో కల్తీ జరగలేదని చెప్పడం ద్వారా తిరుమల లడ్డూప్రసాదంలో కల్తీ జరిగినట్టు వారు పరోక్షంగా అంగీకరించారని దుర్గేష్ ధ్వజమెత్తారు. వైకాపా నేతల మాటల్లో పొంతన లేదని, 319 రూపాయలకు నాణ్యమైన ఆవునెయ్యి ఎక్కడి నుంచి లభిస్తుందని మంత్రి ప్రశ్నించారు. భోలే బాబా డెయిరీ కేంద్రంగానే ప్రత్యేక శ్రద్ధతో కల్తీనెయ్యి తయారుచేయించారని ఎద్దేవా చేశారు.

### ఆ నివేదికను తొక్కిపెట్టి కల్తీ కొనసాగింపు
# క్షమించరాని నేరం

తెరలేపారు. 2022లోనే కల్తీని నిర్ధారించిన సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదికను తొక్కిపెట్టి కల్తీని కొనసాగించడం క్షమించరాని నేరం. దీనిపై 'టీమ్ 11' అసెంబ్లీకి వచ్చి సమాధానాలు చెప్పగలదా? కల్తీ వ్యవహారంలో అనేక మంది ఉన్నారని వైవీ సుబ్బారెడ్డి అన్నారు.. వారెవరో ఆయన చెప్పాలి. లడ్డూలో కల్తీ జరిగిందని ఒకటి కాదు.. నాలుగు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దేవుడికి మహాపచారం తలపెట్టిన వారిని కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదు"అని గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు.

### కాసుల కక్కుర్తితో..
# కలియుగ దైవానికే అపచారం

నెయ్యి పేరుతో వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై ఎంబార్ జీయర్ స్వామి శనివారం ఒక వీడియో విడుదల చేశారు. 'ప్రజలంతా తిరుపతి లడ్డూను సాక్షాత్తూ ఆ వేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షంగా భావించి స్వీకరిస్తారు. ఎవరైనా తిరుమల వెళ్లి వచ్చి లడ్డూ ఇస్తే.. ఏడుకొండల వాడి అనుగ్రహం లభించిందని సంతోషిస్తారు. అంతటి పవిత్రమైన తిరుమల ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించడం హేయమైన చర్య. ఇలాంటి తప్పులు జరుగుతుంటే లోకక్షేమమే దెబ్బతింటుంది. ఈ కల్తీకి కారకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం' అని ఎంబార్ జీయర్ స్వామి పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి తప్పులు జరగకుండా ఏపీ ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం ఒక కమిటీ ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**దైవభక్తి లేనివారు చేసిన దారుణమిది**
**ఇంకా ఎక్కడెక్కడ కల్తీలున్నాయో తేల్చాలి**
**సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి**

వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమలలో కల్తీ నెయ్యితో లడ్డూ తయారు చేయించి ప్రసాదంగా ఇచ్చారని తమిళనాడులోని మన్నార్‌గుడి మఠాధిపతి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామీజీ పేర్కొన్నారు. 'దైవభక్తిలేని వారు చేసిన ఈ పనివల్ల ప్రసాదం స్వీకరించే లక్షల మంది భక్తుల ఆరోగ్యం ఎంతలా దెబ్బతింటుందో.. వారి మనోభావాలు ఎంతగా గాయపడతాయో ఆలోచించాలి. ఇలాంటి కల్తీలకు పాల్పడినవారు ఎవరైనా కఠినంగా శిక్షించాలి' అని కోరారు. ప్రస్తుతం బయటపడింది కల్తీ నెయ్యి మాత్రమేనని, ఇంకా ఎక్కడెక్కడ కల్తీ జరిగిందో పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని సూచించారు.

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి ప్రధాని మోదీకి వ్యాసరాజమఠాధిపతి**
**శ్రీ విద్యాశ్రీశ తీర్థ స్వామీజీ లేఖ**

పవిత్ర లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే ఆవునెయ్యి కల్తీకి గురైందని తెలిసి తీవ్ర మనస్తాపానికి గురయ్యామని కర్ణాటకలోని వ్యాసరాజమఠాధిపతి శ్రీ విద్యా శ్రీశ తీర్థ స్వామీజీ పేర్కొన్నారు. స్వామీజీ శనివారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. 'ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది భక్తులు అచంచల విశ్వాసంతో పూజించే ఆపదమొక్కుల వాడు వేంకటేశ్వరస్వామి. ఆ స్వామి వారి మహాప్రసాదం తయారీలో అపచారం జరిగింది. ఇది హిందూ ధర్మాన్ని అనుసరించేవారి మనోభావాల్ని తీవ్రంగా గాయపరిచింది. ఘోర తప్పిదానికి బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల్ని కోరుతున్నాం' అని లేఖలో పేర్కొన్నారు.

### మహిళ కంపార్ట్‌మెంట్‌లో
# ఆగంతుకుడు

అప్రమత్తమయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అసలు ఏం జరిగిందంటే.. ఘట్కోపర్ స్టేషన్ మీదుగా ప్రయాణిస్తున్న లోకల్ ట్రైన్‌లో మహిళ కంపార్ట్‌మెంట్‌లోకి బురఖా ధరించిన వ్యక్తి ఎక్కాడు. అతడి ప్రవర్తనపై ప్రయాణికులకు అనుమానం వచ్చింది. నిందితుడిని చుట్టుముట్టి నిలదీశారు. మారువేషంలో వచ్చినది పురుషుడని తెలియగానే వెంటనే రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. తర్వాతి స్టేషన్‌కు చేరకముందే నిందితుడు ఆ రైలు నుంచి దూకి మరో ట్రైన్ ఎక్కి పారిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. దొంగతనం చేయడానికి మారువేషంలో వచ్చి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

### సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే
# ఏ నిర్ణయమూ తీసుకోం..

చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పనుల్లో భాగంగా నిర్మించిన వసతి గృహ భవనాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం గణపురం మండలం చెల్పూర్ పరిధిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. "ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. దేశానికే నాయకత్వం వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాది కీలకపాత్ర. సింగరేణి కార్మికుల ప్రత్యేకతను ఉద్యమంలో చూశాం. భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలను రద్దు చేసే ఆలోచన మాకు లేదు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయాలంటే ప్రజలతో చర్చించే చేస్తాం. భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదు.. కొనసాగుతుంది.

కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతున్నది కిషన్‌రెడ్డి కాదా?

2004–14 మధ్య 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చాం. గత పదేళ్లలో ఎవరికైనా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చిందా? కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. కేసీఆర్‌కు పేదల పట్ల ఎలాంటి పట్టింపు లేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ బీఆర్ఎస్‌కు.. ఇందిరమ్మ ఇళు ఉన్న ఊరిలో ఓట్లన్నీ కాంగ్రెస్‌కు అని ఆనాడు చెప్పా. అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు గంపగుత్తగా ఓట్లు వేశారు. ఏప్రిల్ తర్వాత ఇందిరమ్మ ఇళ్లు రెండో విడత ఇస్తాం. దక్షిణ కుంభమేళాగా సమ్మక్క.. సారలమ్మ జాతర నిర్వహించుకొన్నాం. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం. అటవీ ప్రాంతంలో రిసార్ట్‌లను అభివృద్ధి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు ఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యాపారులను బెదిరించి ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో రూ.1500 కోట్లు తీసుకున్నారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి. పాపాల ఊబిలో ఆ పార్టీ కూరుకుపోతుంది. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారు. 'నేను ముఖ్యమంత్రినా కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి' అని కిషన్‌రెడ్డి చెబుతున్నారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమానిస్తున్నారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ..
# 'నక్సలిజం'పై అమిత్ షా కీలక భేటీ

తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల అధికారులు, కేంద్ర సంస్థలు, భద్రతాబలగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మావోయిస్టులపై కేంద్రం కొన్నేళ్లుగా ఉక్కుపాదం మోపుతోంది. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జనవరి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో ఆయా ఎన్‌కౌంటర్‌లలో నంబాల కేశవరావు వంటి అగ్ర నేతలు సహా 500 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. అదే వ్యవధిలో రాష్ట్రంలో దాదాపు 1,900 మంది నక్సలైట్లు అరెస్టయ్యారు. 2,500 మందికి పైగా లొంగిపోయారు.

### కాంగ్రెస్, బీఆర్ఎస్..
# రెండు పార్టీలు ఒక్కటే

దారి మళ్లిస్తోందని విమర్శించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో భాజపా జెండా ఎగరబోతోందని జోస్యం చెప్పారు. నల్గొండలో ఇప్పటికీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదన్నారు. భాజపాను గెలిపిస్తే నల్గొండను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అవకాశాలు ఇచ్చారు.. ఒక్కసారి భాజపాకు అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. భాజపాకు అవకాశం ఇస్తే తెలంగాణను అవినీతి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

### డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడేతో
# ఏపీకి ప్రయోజనం

మీడియా సమావేశంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి పెమ్మసాని మాట్లాడారు. "దేశంలో సామాన్యుల నుంచి వ్యాపారులు వరకు అందరికీ ఉపయోపడేలా.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా బడ్జెట్ ఉంది. జీవిత బీమా, ఆరోగ్య బీమాపై పన్ను జీరో చేశారు. వస్తువుల ధరలు తగ్గించడం వల్ల ప్రజలకు భారం తగ్గుతుంది. రక్షణ రంగానికి కేటాయింపులను 21 శాతానికి పెంచారు. ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు ఏర్పాటు చేయబోతున్నారు. అందులో ఏపీ కూడా ఉంటుంది. వీబీజీ రామ్‌జీ పథకానికి మరో రూ.10వేల కోట్లు అదనంగా కేటాయించారు. జగన్ హయాంలో 90కి పైగా ప్రభుత్వ పథకాలు మరుగున పడ్డాయి. ఆయన అర్ధంతరంగా ఆపేసిన పథకాలకు సంబంధించిన పనులకు వడ్డీలు చెల్లించి మరీ కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది" అని పెమ్మసాని వివరించారు.

### రేవంత్‌ను కేసు నుంచి తప్పించడానికే
# ల్యాబ్ తగులబెట్టారు

ఎన్నికల్లో బిజీగా ఉంటే రేవంత్‌రెడ్డి మాత్రం మురికి పనుల మీద ఉన్నారు. కేసు చివరి దశలో ఉన్నప్పుడు అగ్ని ప్రమాదం జరగడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు జరిగి ఏడాదిన్నర అయినా.. కనీసం కేసు కూడా నమోదు కాలేదు. సింగరేణి కుంభకోణం బయటపెట్టినా.. కేంద్రం స్పందించటంలేదు" అని కేటీఆర్ ఆరోపించారు.

# ఎడిటర్ వాయిస్

## క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏంటీ? దాంతో ఏంటి ప్రయోజనం?

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సరికొత్త చరిత్రకు వేదికైంది. ఐటీ రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు అమరావతిని భవిష్యత్ టెక్నాలజీ 'క్వాంటం కంప్యూటింగ్'కు గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా అడుగులు వేశారు. శనివారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో దేశంలోనే మొట్టమొదటి 'అమరావతి క్వాంటం వ్యాలీ' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

సిలికాన్ వ్యాలీ గతం.. క్వాంటం వ్యాలీ వర్తమానం!

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "గతంలో సిలికాన్ వ్యాలీ ఐటీ విప్లవానికి నాంది పలికితే రాబోయే రోజుల్లో క్వాంటం వ్యాలీ ప్రపంచాన్ని శాసించబోతోంది. హైదరాబాద్‌కు హైటెక్ సిటీ ఎలాగో, దేశానికి అమరావతి క్వాంటం వ్యాలీ అలా గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరావతిలో దేశంలోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తెస్తాం" అని ప్రకటించారు.

ప్రాజెక్టు ప్రత్యేకతలు: సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. 48 అంతస్తులు, 29 అంతస్తులతో కూడిన ఎనిమిది భారీ టవర్లను నిర్మిస్తున్నారు. ఐబీఎం , టీసీఎస్ , ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్నాయి. 2030 నాటికి దేశానికి అవసరమైన 2.5 లక్షల క్వాంటం నిపుణులలో మెజారిటీ వాటా అమరావతి నుంచే ఉండేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎందుకు ఈ క్వాంటం టెక్నాలజీ? సాధారణ కంప్యూటర్లు సంవత్సరాల తరబడి చేసే క్లిష్టమైన లెక్కలను క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్లలో పూర్తి చేస్తాయి. దీనివల్ల వాతావరణ అంచనాలు, క్యాన్సర్ వంటి వ్యాధులకు కొత్త మందుల తయారీ, హ్యాకింగ్‌కు గురికాని సైబర్ సెక్యూరిటీ, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. అరుదైన పురస్కారం.. ?100 కోట్ల బహుమతి! పరిశోధనలను ప్రోత్సహించేందుకు చంద్రబాబు ఒక సంచలన ప్రకటన చేశారు. క్వాంటం టెక్నాలజీ రంగంలో ఎవరైనా నోబెల్ బహుమతి సాధిస్తే వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ?100 కోట్ల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అమరావతే నాలెడ్జ్ హబ్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## ఇద్దరు పిల్లలకు ఉరేసి.. తల్లి ఆత్మహత్య

### భర్త చేసిన అప్పులే కారణమని లేఖ - తిరుపతి జిల్లా పుత్తూరులో విషాదం





**పుత్తూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** 'తల్లిదండ్రులను కాదని పెళ్లి చేసుకున్న ప్రతి ఒక్కరికి నా జీవితం ఓ గుణపాఠం. ఒక అమ్మాయి ఎలాంటి లక్షణాలు తన భర్తకు ఉండకూడదని అనుకుంటుందో.. అవన్నీ నా భర్తలో ఉన్నాయి. ఇది నేను కలలోనూ అను కోలేదు. శివశంకర్.. నిన్ను ప్రేమ వివాహం చేసుకున్న పాపానికి ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు. నా కడు పున పుట్టిన పిల్లలూ ఆ కష్టాన్ని అనుభవిస్తున్నారు. ఊరంతా అప్పులు చేసి, తీర్చలేను అంటే.. నేనేం చేయాలి. ఇక ఉంటా! నేను చనిపోయాక ఎలాగూ ఇంకో పెళ్లి చేసుకుంటావ్, ఈ సారైనా లైఫ్‌లో సెటిల్ అయ్యాక చేసుకో' అని లేఖ రాసిన ఓ వివాహిత.. తన ఇద్దరు పిల్లలకు ఉరేసి, తానూ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉదంతమిది. తిరుపతి జిల్లా పుత్తూరులో జరిగిన ఈ విషాద ఘటనపై పోలీసులు, స్థానికుల కథనం.. పుత్తూరు మండలం నేషనూరుకు చెందిన కన్నెప్పరెడ్డి కుమార్తె పద్మ(28), తొరూరు పంచాయతీకి చెందిన శివశంకర్ పుత్తూరులో డిగ్రీ చదువుకునే రోజుల నుంచీ స్నేహితులు. వీరు ప్రేమపెళ్లికి సిద్ధపడగా.. కులాలు వేరు కావడం, శివశంకర్ పని లేక జులాయిగా తిరుగుతున్నాడని పద్మ తల్లిదండ్రులు అంగీకరించలేదు. అయినా ఆమె అతన్ని 2019లో వివాహం చేసుకుంది. వీరికి తేజ(6), లాస్య(5) కుమార్తెలు సంతానం. పిల్లలు స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ప్రస్తుతం వీరు పుత్తూరులో నివాసం ఉంటున్నారు.

**కుటుంబ పోషణకు కష్టాలు**

శివశంకర్ జులాయిగా తిరుగుతూ ఇంటి ఖర్చులకూ డబ్బులివ్వడం లేదని పద్మ రాసిన లేఖ ద్వారా స్పష్టమవుతోంది. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉండి, రుణం తీసుకున్నారు. పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి అద్దె, ఇతర ఖర్చులకు ప్రతినెలా ఇబ్బంది పడుతోంది. భర్త ఇంటి విషయాలు పట్టించుకోవడం లేదు. దీనిపై రెండు రోజుల క్రితం శివశంకర్‌ను పెద్ద మనుషులు మందలించారు. కుటుంబాన్ని బాగా చూసుకుంటానని, తనకు శ్రీసిటీలో ఉద్యోగం వచ్చిందని వారికి చెప్పాడు. శనివారం బయటకు వెళ్లిన భర్తకు ఫోన్ చేసిన పద్మ.. డ్వాక్రా సంఘంలో అప్పు కట్టావా అని ప్రశ్నించింది. భర్త చెల్లించలేదని చెప్పడంతో మనస్తాపం చెందింది. ఆత్మహత్య లేఖ రాసి, బెడ్ రూమ్‌లో ఇద్దరు పిల్లలకు ఉరేసి చంపి, తాను హాల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికొచ్చిన శివశంకర్.. తలుపులు వేసి ఉండటం, ఎంతకీ తీయకపోవడంతో మామ కన్నెప్పరెడ్డికి ఫోన్ చేశాడు. అతను వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా, ముగ్గురూ విగతజీవులుగా ఉరికి వేలాడుతున్నారు. డీఎస్పీ రవికుమార్ ఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. శివశంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## ఆన్‌లైన్ గేమింగ్.. రూ.5వేల కోట్ల విలువైన సిండికేట్‌పై ఇంటెలిజెన్స్ దాడులు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆన్‌లైన్ గేమింగ్ వ్యవహారంలో హైదరాబాద్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం గుట్టురట్టు చేసింది. రూ.5వేల కోట్ల విలువైన గేమింగ్ సిండికేట్‌పై దాడులు చేపట్టింది. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసుకున్న నెట్‌వర్క్‌లో ముంబయికి చెందిన వైఎస్ ప్రభుకుమార్, హైదరాబాద్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డిని ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. గత కొన్నేళ్లుగా దీనికి సంబంధించి అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్, దిల్లీ, ముంబయిలో సోదాలు చేపట్టారు. జీఎస్టీ ఎగవేత, అక్రమ లావాదేవీలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

## ఏటీఎం చోరీకి యత్నించి.. పోలీసులకు చిక్కి

**విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తునిలో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ యత్నాన్ని బ్యాంకు అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత రామా థియేటర్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం గదిలోకి ఓ వ్యక్తి వెళ్లాడు. ముందుగా సర్వర్ గది తెరిచి లోపలికి చొరబడ్డాడు. ఆ తర్వాత రాయితో ఏటీఎంను పగులకొట్టేందుకు యత్నించాడు. ఈ తతంగమంతా సెంట్రల్ మానిటరింగ్ కేంద్రం నుంచి సీసీటీవీలో పరిశీలించిన సిబ్బంది విషయాన్ని స్థానిక బ్యాంకు అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన బ్యాంక్ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే చోరీకి విఫలయత్నం చేసిన నిందితుడు అక్కడి నుంచి జారుకున్నాడు. సీసీటీవీ ఆధారంగా గాలించి పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

సైబర్ నేరగాళ్లపై

## హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సైబర్ నేరాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు పనిచేస్తున్నారు. గత నెలలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో దేశ వ్యాప్తంగా 7 రాష్ట్రాలకు చెందిన 37 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సైబర్ నేరాలకు సంబంధించి 26 కీలక కేసులను ఛేదించామని హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్‌బాబు తెలిపారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు జనవరిలో 117 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అందులో అందులో 15 ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, 2 డిజిటల్ అరెస్ట్ కేసులు, 4 సోషల్ మీడియా ఆధారిత పోక్సో కేసులు, 5 బిజినెస్, గేమింగ్, జాబ్ ఫ్రాడ్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేయడంతో బాధితులకు రూ.71.91లక్షలు రీఫండ్ చేశామని చెప్పారు. వివిధ కేసుల్లో అరెస్ట్ అయిన నిందితులు దేశవ్యాప్తంగా 86 కేసులతో సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. అందులో తెలంగాణలో 19, ఆంధ్రప్రదేశ్- 14, రాజస్థాన్-12, మహారాష్ట్ర- 14, కర్ణాటక-15, కేరళ- 5, గుజరాత్ -7, తమిళనాడు-7, పశ్చిమ బెంగాల్ -2, మధ్యప్రదేశ్ -1, బిహార్ - 2, దిల్లీ- 6, ఉత్తరప్రదేశ్ -5, హరియాణా-2, ఒడిశా-2 కేసుల్లో నిందితుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. నిందితుల బ్యాంక్ ఖాతాల లావాదేవీలను పరిశీలించగా దాదాపు రూ.65 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ కేసుల దర్యాప్తులో నిందితుల వద్ద నుంచి 26 సెల్ ఫోన్లు, 79 సిమ్ కార్డులు, 62 డెబిట్ కార్డులు, 57 చెక్‌బుక్‌లు సహా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సి-మిత్రకు 1706 ఫిర్యాదులు అందగా వాటిలో 315 ఎఫ్ఐఆర్లు నమోదు చేశామని పోలీసులు వెల్లడించారు. ఈ విభాగం ద్వారా మరో 13 మందిని అరెస్ట్ చేసి, రూ.10.65 లక్షల నగదును బాధితులకు తిరిగి ఇప్పించినట్లు అధికారులు వెల్లడించారు. ఉన్నతాధికారుల పేర్లతో వచ్చే నకిలీ వాట్సాప్, సోషల్ మీడియా మెసేజ్‌లను నమ్మి డబ్బులు పంపవద్దని, వాట్సాప్ లేదా టెలిగ్రామ్ గ్రూపుల్లో అధిక లాభాల పేరుతో వచ్చే పెట్టుబడి స్కీమ్‌లకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. అలాగే బ్యాంకుల పేరుతో వచ్చే అనుమానాస్పద లింకులు, ఏపీకే ఫైల్స్‌ను క్లిక్ చేయవద్దని, డిజిటల్ అరెస్ట్ కాల్స్‌కు భయపడవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన డబ్బును ఫ్రీజ్ చేసి తిరిగి పొందే అవకాశం ఉంటుందని పోలీసులు సూచించారు.

## సాగర్ కాల్వలోకి దూసుకెళ్లిన కారు..

### భార్య మృతదేహం లభ్యం..



**నిడమనూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండ జిల్లాలో సాగర్ ఎడమ కాల్వలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో గాలింపు కొనసాగుతోంది. నిడమనూరు మండలం ముకుందాపురం వద్ద శనివారం రాత్రి ఈ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో త్రిపురారం మండలం కంపాసాగర్‌కు చెందిన దంపతులు పుల్లయ్య, పద్మ కారులోనే చిక్కుకుపోయి గల్లంతయ్యారు. ఆదివారం ఉదయం కాల్వ నుంచి కారును క్రేన్ సహాయంతో బయటకు తీశారు. అందులో పద్మ మృతదేహం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పుల్లయ్య ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. శనివారం రాత్రి ఈ ప్రమాదం జరగ్గా.. కారు డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

# ఆరోగ్యానికి అమృతం 'రాగి గంజి'..

## హెల్త్ వాయిస్

**రాగి గంజిలో ఫెర్మెంటేషన్ వల్ల పెరిగే పోషకాలు**
**స్టెప్ బై స్టెప్ తయారీ విధానం ఇలా**
**ప్రోబయోటిక్స్‌తో గట్ హెల్త్‌కు పూర్తి రక్షణ**
**డయాబెటిస్, బరువు నియంత్రణకు రాగి గంజి బెస్ట్ డ్రింక్**



మారుతున్న జీవనశైలిలో మనం రకరకాల ఎనర్జీ డ్రింక్స్‌పై ఆధారపడుతున్నాం. కానీ, మన పూర్వీకులు అందించిన సాంప్రదాయ పానీయాల్లో 'రాగి గంజి' అగ్రస్థానంలో ఉంటుంది. ముఖ్యంగా ఎండలు మండుతున్న వేసవి కాలంలో శరీరానికి తక్షణ శక్తిని ఇస్తూనే, ఉష్ణోగ్రతను అదుపులో ఉంచే అద్భుత శక్తి రాగులకు ఉంది. తక్కువ ఖర్చుతో ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోగలిగే ఈ అమృత పానీయం తయారీ విధానం , ప్రయోజనాలు ఇవే..

రాగి గంజి తయారీలో 'ఫెర్మెంటేషన్' ప్రాముఖ్యత

రాగి గంజిని నేరుగా పిండితో వండుకోవడం కంటే, రాత్రంతా నానబెట్టడం (ఖీవతీఎవఞ్ఙఅశీఅ) వల్ల కలిగే లాభాలు మెండు. ఇలా చేయడం వల్ల అందులో సహజమైన 'ప్రోబయోటిక్స్' వృద్ధి చెందుతాయి. ఇవి మన ప్రేగుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

విధానం: పావు కప్పు రాగి పిండిని నీళ్లలో కలిపి రాత్రంతా పక్కన పెట్టాలి. మరుసటి రోజు ఉదయం పైన పేరుకున్న నురగను తొలగించి, మిగిలిన మిశ్రమంతో గంజిని తయారు చేసుకోవాలి.

**తయారీ విధానం: స్టెప్-బై-స్టెప్**

**ఉడికించడం:** ఒక పాత్రలో మూడు కప్పుల నీటిని వేడి చేసి, అందులో నానబెట్టిన రాగి మిశ్రమాన్ని పోయాలి. మంటను మధ్యస్థంగా ఉంచి 15 నిమిషాల పాటు కలుపుతూ ఉడికించాలి. పిండి ఉడికిన తర్వాత దానిని పూర్తిగా చల్లారనివ్వాలి.

రుచులు జోడించడం: చల్లారిన రాగి మిశ్రమానికి తగినంత చిక్కటి పెరుగును కలపాలి. ఇందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, కొత్తిమీర , రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా విస్క్ చేయాలి.

**సర్వింగ్:** ఈ మిశ్రమాన్ని మరింత రుచిగా మార్చడానికి మట్టి పాత్రలో పోసి కాసేపు ఉంచితే, అది సహజమైన చల్లదనాన్ని పొందుతుంది.

ఎవరెవరు తీసుకోవచ్చు? (ఆరోగ్య ప్రయోజనాలు)

**మహిళలకు వరం:** 30 ఏళ్లు దాటిన మహిళల్లో కాల్షియం లోపం తలెత్తే అవకాశం ఉంటుంది. రాగుల్లో కాల్షియం పుష్కలంగా ఉండటం వల్ల ఎముకలు బలంగా మారుతాయి.

**డయాబెటిస్ రోగులకు:** దీని గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. కాబట్టి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచకుండానే ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది.

**బరువు తగ్గాలనుకునే వారికి:** ఇందులో ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువగా ఉంటుంది. ఒక్క గ్లాసు రాగి గంజి తాగితే కడుపు నిండుగా అనిపించి, అనవసరమైన ఆహారంపై ధ్యాస మళు తుంది.

వేసవి తాపం నుండి తప్పించుకోవడానికి కృత్రిమ శీతల పానీయాల కంటే రాగి గంజిని అలవాటు చేసుకోవడం ఉత్తమం. ఇది కేవలం ఒక పానీయం మాత్రమే కాదు, సంపూర్ణ ఆరోగ్యానికి ఒక చక్కని మార్గం.

# విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

సోమవారం, 09 ఫిబ్రవరి 2026

www.viswamvoice.com



# ఎంపిఎస్ 26వ వార్షికోత్సవ వేడుకలు

**ప్రతి విజయంలో తల్లితండ్రుల సహకారాలు మరువలేనివి : డైరెక్టర్ చిన్నారావు**

**అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు**






**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యకు విలువలను జోడించి కళలకు క్రమశిక్షణ జతచేసి ఎందరో విద్యార్థుల భవిష్యత్తును బంగారు బాటలు వేసిన ఏకైక విద్యాసంస్థలు ఎం పీ ఎస్. మండపేట ఎం పి ఎస్ విద్యాసంస్థల 26వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిధిగా రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ పాల్గొన్నారు. ఎం పి ఎస్ విద్యాసంస్థల డైరెక్టర్ వల్లూరి చిన్నారావు ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షత వహించారు. తొలుత చిన్నారావు మాట్లాడుతూ ఎంపీఎస్ విద్యాసంస్థలు ఆరంభం చేసి 26 వసంతాలు పూర్తి చేసుకోవడానికి, విద్యాసంస్థలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి తన ప్రయాణంలో ప్రతి సందర్భంలోను తనకు తోడుగా ఉన్నా ప్రతి ఒక్కరికి, తనపై నమ్మకం ఉంచి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిభ కలిగిన ఆర్థిక స్తోమత అంతంతమాత్రాన ఉండే ప్రతి విద్యార్థి కళల సహకారానికి ఎంపిఎస్ విద్యాసంస్థలు అండగా నిలిచి సహాయ సహకారాలు అందిస్తాయని అన్నారు. గవర్నమెంట్ వారు ఇచ్చే స్టార్ ర్యాంకింగ్ నందు చుట్టుపక్క గ్రామాలలో ఏ విద్యాసంస్థలకు రాని పోస్టర్ ర్యాంక్ ని ఎంపీఎస్ విద్యాసంస్థలు సాధించాయని అన్నారు. అనంతరం వేగుళ్ల లీలా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి వారి తల్లిదండ్రులు విద్యాసంస్థలు మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎంపీఎస్ విద్యాసంస్థలు విశేష ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్నాయని అన్నారు. దీనికి ఉపాధ్యాయుల కృషి, స్కూలు అభివృద్ధి కోసం ఎప్పుడూ పాటుపడే డైరెక్టర్ చిన్నారావును ఆయన అభినందించారు. అనంతరం వివిధ తరగతుల మెరిట్ విద్యార్థులకు అతిధుల చేతుల మీదుగా మెడల్స్ ను బహూకరించారు. విద్యార్థిని విద్యార్థుల డాన్సులతో, దేశభక్తిని పెంపొందించే సందేశాత్మక నాటికలతో, కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరిని అలరించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు, పలు విద్యాసంస్థల అధినేతలు, తల్లిదండ్రులు, ఎం పి ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో ఇళ్లు వినియోగంలోకి తేవాలి

**ఈ ఏం ఐ లు చెల్లిస్తూ.. జీవితం గడపడం కష్టంగా ఉంది అంటున్న లబ్ధిదారులు**

**అప్పుల ఊబిలో కూరుకు పోతున్న టిడ్కో హౌసింగ్ లబ్ధిదారులు - టిడ్కో ప్రాజెక్ట్‌పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**

**ఇకనైనా ఆలస్యం చేయకుండా గృహాలు ప్రజలకు అందించండి - బిజెపి డిమాండ్**

**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాజమండ్రి రూరల్ మండలం అధ్యక్షులు మట్ట నాగబాబు నేతృత్వంలో రూరల్ లో టీడ్కో గృహాలు పర్యవేక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్ యానాపు ఏసు మాట్లాడుతూ టిడ్కో గృహాలను చూస్తే బాధేస్తుంది అని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పిఎంఎవై పథకం ద్వారా లక్షల ఇళ్లకు అనుమతి ఇచ్చి, వేల కోట్ల నిధులు ఆంధ్రప్రదేశ్‌కు అందించింది. ఈ సహకారంతో స్థలం ఉన్న పేదవారి కల నెరవేరింది. స్థలం లేని పేదల కోసం చంద్రబాబు నాయుడు టిడ్కో హౌసింగ్ ఆలోచనతో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పేదల సొంతయింటి కల నెరవేర్చే ప్రయత్నం చేశారు. కానీ 2019--2024 మధ్యకాలంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పూర్తయిన టిడ్కో ఇళ్లు ప్రజలకు ఇవ్వకుండా ఏళ్ల తరబడి తాళాలు పడిపోయాయి. కొత్త ఇళ్లు కూడా శిధిలాలుగా మారుతున్నాయి.



**ఇంకా దారుణం ఏమిటంటే..**

రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు అడ్వాన్స్ కట్టిన పేద కుటుంబాలు, ఇల్లు లేకుండానే బ్యాంక్ ఈ ఏం ఐ లు కడుతున్నారు. ఒకవైపు అద్దె, మరోవైపు ఈ ఏం ఐ కడుతూ జీవితం మొత్తం అప్పుల ఊబిలో పడిపోయింది. భారతి జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా జనతా వారధి కార్యక్రమంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పర్యటనలో భాగంగా టిడ్కో గృహాల లబ్ధిదారులు ఎవరైతే ఉన్నారో వారి నుండి వస్తున్న వినతులు కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. టిడ్కో గృహాలు పరుశీలించగా నివాశాలకు వెళ్లకపోవడం వలన స్లాబులు తుప్పు పట్టాయి, వైరింగ్ దొంగిలించారు, గోడలు పాడవుతున్నాయి, మౌలిక వసతులు లేక భవనాలు శిధిలం అవుతున్నాయి. ప్రజా ధనం, ప్రభుత్వ ధనం శిధిలం వృధా అవుతుంది. బిజెపి స్పష్టంగా డిమాండ్ చేస్తుంది వెంటనే అన్ని పూర్తయిన టిడ్కో ఇళ్లను ప్రజలకు అప్పగించాలి. పాడైన ఇళ్లను ప్రభుత్వ ఖర్చుతో రిపేర్ చేయాలి. ఈ ఏం ఐ కట్టిన కాలానికి పరిహారం ఇవ్వాలి. అడ్వాన్స్ కట్టిన వారందరికీ న్యాయం చేయాలి. టిడ్కో ప్రాజెక్ట్‌పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి అని అన్నారు. ఈ విషయాలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి టిడ్కో గృహాల లబ్దిదారులకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు మరుకుర్తి కుమార్ యాదవ్, మరకాని సతీష్ ప్రేమ్, మజ్జి సాయి, సిద్ధాని వెంకట్, పంచికట్ల వీర్రాజు, పోతురాజు శ్రీనివాస్, సతీష్, నాగభూషణ్, సిరిపల్లి ప్రేమ్ కుమార్, టిడ్కో గృహాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో**

# భారతదేశం అభివృద్ధి పథకం

**ఎంఎస్ఎంఇలకు 10 వేల కోట్లు కేటాయించిన మోడీ**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఇప్పుడు ప్రపంచంలో నాలుగవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మండపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోము వీర్రాజు మాట్లాడుతూ ఏడు శాతం వృద్ధి రేటు కోసం తయారీ రంగంపై ప్రధానంగా దృష్టి సారించారన్నారు. భారతదేశం ఇప్పుడు ప్రపంచంలో 4వ ఆర్థిక శక్తిగా ఏడిగిందన్నారు. దేశ మౌలిక వసతులు, ఉద్యోగ కల్పన, రవాణా వ్యవస్థ, రోడ్లు, సెమీ కండక్టర్ రంగం, గ్రామీణాభివృద్ధికి ఈ బడ్జెట్ దోహద పడుతుందన్నారు. ఎంఎస్ఎంఇ లకు 10 వేల కోట్లు కేటాయించారని, ఆంధ్రప్రదేశ్ కు మూడు కారిడార్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పోలవరానికి మూడు వేల రెండు వందల కోట్లు, రాజధానికి పదిహేను వందల కోట్లు కేటాయించారన్నారు. విద్య వైద్య రంగంలో అనేక ప్రతిపాదనలు తీసుకురావడం, మన రాష్ట్రంలో రెండు వందల వెల్నెస్ సెంటర్ల కేటాయింపు, డేటా సెంటర్ లకు అనేక రాయితీలు, మహిళలకు ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ తో కూడిన హాస్టళ్లను నెలకొల్పడం, యువత కోసం ఎన్నో అంశాలు పొందుపరచడం జరిగిందన్నారు. పేదరిక నిర్మూలన, మహిళా సంస్కరణ ధ్యేయంగా ఈ బడ్జెట్ రూపొందించారన్నారు. భారతదేశం అన్నిరంగాల్లో కూడా పురోగామిగా ఉండే విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి నల్లా పవన్, మాజీ శాసనసభ్యులు అయ్యాజీ వేమ, నియోజకవర్గం కన్వీనర్ కె వి వి సాయిరామ్, కోన సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు నాళం ఫణి ప్రకాష్, కోటిపల్లి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు

# పెళ్లి కాలేదని డిప్రెషన్.. 20వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వివాహం కాలేదనే డిప్రెషన్‌లో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. అత్తాపూర్‌కు చెందిన ప్రవీణ్(30)కు పెళ్లి కాలేదని గత కొన్ని రోజులుగా డిప్రెషన్‌లో ఉన్నాడు. ఈక్రమంలో ఇవాళ మధ్యాహ్నం 20 అంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రఘుదేవపురం బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో**

# అవగాహన సదస్సు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘు దేవపురం బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులో భీమా సంకల్పం 3.0 భాగంగా రాజమండ్రి వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో సీతానగరం పోస్ట్ ఆఫీస్ సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ప్రజలు పోస్ట్ ఆఫీస్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని ముఖ్యంగా ఈనెల 18 19 20 తేదీలలో తపాలా బీమా ప్రత్యేక డ్రైవ్ సదుపాయం అందరూ వినియోగించుకోవాలని కోరారు గత రెండు రోజుల నుండి రఘుదేవపురంలో అవగాహన సదస్సులు జరుగుతున్నాయని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎ.నారాయణ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజమండ్రి వెస్ట్ సబ్ డివిజన్,ఎస్ఎంకె కిషోర్ తపాల భీమా అధికారి, సీతానగరం సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్స్ పాల్గొన్నారు.

# డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

**- ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు**

**- విద్యుత్ సమస్యలపై వినియోగదారులు ఈ ఫోన్ 8688400499 ద్వారా సంప్రదించవచ్చు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సంబంధిత సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ తూర్పుగోదావరి ఎస్ఈ కె తిలక్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. ప్రతి సోమవారం నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభిస్తారన్నారు. తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వినియోగదారులు ఫోను నెంబరు 8688400499 ద్వారా విద్యుత్ సమస్యలను తెలియజేయ వచ్చన్నారు. ఫిబ్రవరి 9న విశాఖపట్నం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో తరచూ ఎదురవుతున్న అంతరాయాలు, హెచ్చు, తగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, టాన్స్ఫార్మర్ల మార్పిడి వంటి సమస్యలపై నేరుగా సీఎండీ దృష్టికి ఈ సందర్భంగా తీసుకు రావచ్చునని ఎస్ఈ కె.తిలక్ కుమార్ పేర్కొన్నారు.

# బాలికల హక్కులు, భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

**- అవగాహన కల్పించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి**

**- ప్రభుత్వ బాలికల సదనాన్ని సందర్శన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్. శ్రీలక్ష్మి ప్రభుత్వ బాలికల సదనాన్ని సందర్శించి అక్కడ బాలికలకు అందుతున్న వసతులు, సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నివసిస్తున్న బాలికలతో సన్నిహితంగా మాట్లాడి వారి విద్య, ఆరోగ్యం, భద్రత, భోజనం, దైనందిన అవసరాలు తదితర అంశాలపై వివరాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి అడిగి తెలుసు కున్నారు. బాలికలు బాగా చదువుకుని, క్రమశిక్షణతో ముందుకు సాగి ఉన్నత స్థాయికి చేరుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆమె సూచించారు. వసతి గృహంలో ఆహార మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా, శుభ్రత, భద్రత, ఆరోగ్య పరిరక్షణ సక్రమంగా జరుగుతున్నాయా..? అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ బాలికలకు కల్పిస్తున్న వసతి, విద్యా వాతావరణం సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి బాలికలకు మంచి స్పర్శ - చెడు స్పర్శలపై అవగాహన కల్పిస్తూ, తమపై జరిగే ఏవైనా అన్యాయాలు, వేధింపుల విషయంలో భయపడకుండా వెంటనే తెలియజేయాలని సూచించారు. బాలికల హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలు, ముఖ్యంగా బాలల సంరక్షణ చట్టం (పోస్కో), బాలల హక్కుల చట్టం, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వసతి గృహంలో గానీ, బయట గానీ ఎటువంటి సమస్యలు ఎదురైనా, న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేదా హెల్ప్‌లైన్ నెంబర్ 15100 ను సంప్రదించాలని బాలికలకు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాలికల హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. క్రమశిక్షణ, సహనశీలత, ఆత్మవిశ్వాసం ప్రతి బాలికలో పెంపొందితేనే సమాజంలో గౌరవప్రదమైన స్థానం సాధించగలరని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని అధికారులకు సూచించారు.

# సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన జిల్లా అధ్యక్షుడు వెంకటేష్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్ట్ టైం టీచర్లను పూరిస్తాయి ఉపాధ్యాయులుగా గుర్తించమని అలాగే వారికి రెగ్యులర్ ఉపాధ్యాయులకు వర్తింప చేస్తున్న అన్ని సదుపాయాలు కల్పించాలని ఇటీవల ఉత్తర ప్రదేశ్ పార్ట్ టైం టీచర్ల కేసుపై సుప్రీంకోర్టు తీర్పుపై పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ల జిల్లా అధ్యక్షులు ఆర్ వెంకటేష్ హర్షం వ్యక్తంచేశారు.ఆదివారం రాజమహేంద్రవరం దానవాయిపేటలో నిర్వహించిన పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అలాగే సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ల సర్వీసును సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా రెగ్యులర్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని రెగ్యులర్ ఉపాధ్యాయులకు వర్తించే సదుపాయాలన్నీ పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లకు కూడా వర్తింపచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇటీవల ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడానికి ఆర్థిక శాఖ తీసుకున్న నిర్ణయంలో సొసైటీలలోను, ప్రాజెక్టులలోను పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పక్కన పెట్టడంపై విచారం వ్యక్తం చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లను విద్యా శాఖలో విలీనం చేసి వారిని రెగ్యులర్ చేయాలని ఒకవేళ ఆలస్యం అయ్యే క్రమంలో హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లీలావతి, సంజీవరావు,ఆర్ లక్ష్మి ,టీ ప్రభాకర్, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

# ఆంధ్రా యూనివర్సిటీ స్టడీ సెంటర్‌ను కొనసాగించాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆంధ్ర యూనివర్సిటీకి సంబంధించి స్టడీ సెంటర్‌ని యధావిధిగా కొనసాగించాలని విద్యార్థుల ఆందోళనకు ఎస్.ఎఫ్.ఐ మద్దతు. ఈ స్టడీ సెంటర్‌లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని బదిలీ చేసి ఆంధ్ర యూనివర్సిటీలో రిపోర్ట్ చేసి రావాలని ఒక సర్కులర్ నీ ఇచ్చారు. దీనిపై ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. రాజా మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆంధ్ర యూనివర్సిటీకి సంబంధించి ఏ స్టడీ సెంటర్స్ ఉన్నాయో దానిలో పనిచేసే నాన్ టీచింగ్ సిబ్బంది అందరినీ యూనివర్సిటీలో రిపోర్ట్ చేసి రమ్మని సర్కులర్లో స్పష్టంగా రాయడం జరిగింది. రాజమండ్రిలో, రాష్ట్రంలో 8 చోట్ల ఈ స్టడీ సెంటర్స్ ఉన్నాయి అని ఈ సెంటర్స్ లో ప్రతి ఏటా 400 మంది విద్యార్థులు చదువుతున్నారని, రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా విద్యార్థులు వచ్చి డిస్టెన్స్ కోర్సెస్ చేయడానికి విద్యార్థులు ఇబ్బంది పడకుండా, టెక్నికల్ ఇబ్బందులు లేకుండా ఉంటాయి. విద్యార్థులు ఫీజులు ఎప్పుడు కట్టాలి, ఎగ్జామ్స్ ఫీజులు ఎప్పుడు కట్టాలి ప్రాసెస్ ఏం తెలియకుండా ఇబ్బంది పడుతున్నారని వాళ్ళకి ఇలాంటి ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతో ఈ స్టడీ సెంటర్స్ ని ఓపెన్ చేశారు. వీటిని ఇప్పుడు అకస్మాత్తుగా ఎందుకు మూసేస్తున్నారు అని ప్రశ్నించారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఎవరైతే ఉన్నారో వాళ్ళు స్టడీ సెంటర్లో ఉన్న విద్యార్థులకు టెక్నికల్గా ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, అలాగే నాన్ టీచింగ్ స్టాఫ్ ఉండాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ. జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కనక,జిల్లా కమిటి సభ్యులు నాగచైతన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవార్ని దర్శించుకున్న ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం చినద్వారపూడి వద్ద ఉన్న శ్రీ సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు సంధర్భంగా ఆదివారం చిన ద్వారపూడిలో శ్రీ సత్తెమ్మ తల్లిని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు దర్శించుకున్నారు. ఈ సంధర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మండపేట మండల టీడీపీ మాజీ అధ్యక్షులు యరగతపు బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.



# పల్లెలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలన్న గాంధీజీ మాట నిజం చేస్తున్నాం..

## అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం... : కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు, గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధికి పునాది అన్న జాతిపిత మహాత్మా గాంధీజీ మాటలను నిజం చేస్తూ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలంలో వివిధ గ్రామాల్లో రూ.3.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన నిర్వహించారు దేవరపల్లిలో ఎమ్జీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. వెదిరేశ్వరంలో ఎమ్జీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ. 40 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రావులపాడులో జాతీయ రహదారి నుంచి ఆర్ & బి రోడ్డు వరకు (అరటి పళ్ల మార్కెట్ రోడ్డు) ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 50 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. కొమర్రాజులంక బ్రిడ్జి నుంచి కొత్తపేట – మందపల్లి ఏటిగట్టు వరకూ ఎమ్జీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.90 లక్షలతో మెటల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు రావులపాలెంలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 40 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈతకోటలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 30 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఈతకోట గ్రామంలో రూ.90 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డులు, డ్రెయిన్లు ప్రారంభించారు. పొడగట్లపల్లిలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 30 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గోపాలపురంలో ఎమ్జీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 40 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే మండలంలోని ఈతకోట, గోపాలపురం-2, కొమర్రాజులంక, ముమ్మిడివరప్పాడు, రావులపాలెం గ్రామాల్లో రూ.2.16కోట్లతో (ఒక్కొకటి 36లక్షలు) నిర్మించనున్న 6 వెల్నెస్ సెంటర్లకు శంకుస్థాపన చేశారు. ఈతకోట గ్రామంలో సుమారు కోటి 20 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్లు, డ్రెన్‌లను ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన, అభివృద్ధి కార్యక్రమాల పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో వచ్చే మూడేళ్లలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

# మన ఊరు మన ఆరోగ్యం మన భాధ్యత నినాదంతో కోనసీమ రన్



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య పరిరక్షణకు రోజులో కొంతసేపు రన్నింగ్, వాకింగ్ తప్పనిసరని ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలియజేశారు. ఆదివారం రావులపాలెంలో కోనసీమ గోదావరి రన్నర్స్ అసోసియేషన్,తేజారెడ్డి మణిహంస దంపతులు నిర్వహించిన 3కె, 5కె, 10కె మారథాన్ రన్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన పాల్గొన్నారు. 10కె, 5కె, 3కె రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు జెండా ఊపి ప్రారంభించారు. కొంత దూరం రన్నింగ్ లో పాల్గొని రన్నర్లను ఉత్సాహపరిచారు. పెద్ద, పెద్ద పట్టణాల్లో జరిగే మారథాన్ రన్ కార్యక్రమాన్ని రావులపాలెంలో నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. నేటి జీవనశైలిలో అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వాటన్నిటికీ పరిష్కారంగా డాక్టర్లు, పరిశోధకులు క్రమం తప్పని వ్యాయామం అవసరమని చెబుతున్నారన్నారు. అనారోగ్య సమస్యలు దరి చేరకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా రోజులో కొంత భాగం నడక గాని,పరుగు గాని, వ్యాయామం కాని చేయాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉన్న సాధనాలుగా వాకింగ్, రన్నింగ్ అందరూ ఆచరించవచ్చున్నారు. ఆరోగ్య పరిరక్షణకు వాకింగ్, రన్నింగ్ యొక్క ఆవశ్యకతను అందరికీ తెలియజేయడం కోసం, చైతన్యాన్ని పెంపొందించడం కోసం ఇటువంటి 10కె రన్, మారథాన్లు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విక్టరీ అధినేత వెంకటరెడ్డి సి ఆర్ సి అధ్యక్షులు నాగమోహనరెడ్డి మాజీ ఎం ఎల్ ఏ చిర్ల జగ్గిరెడ్డి గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, చిలువూరి సతీష్ రాజు, చిన్నం శ్రీనివాసరెడ్డి అధికారులు నాయకులు టీచర్లు విద్యార్థిని విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.ఎంతో అహలధాకరంగా జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికేట్ ఇచ్చి అభినందించారు.

# కష్టానికి గౌరవం, నిబద్ధతకు గుర్తింపు ఇచ్చేది తెలుగుదేశం పార్టీ

### సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సువర్ణమయం

### తూర్పుగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షులు “బొడ్డు” ప్రమాణస్వీకార సభలో మంత్రి వాసంశెట్టి సుభాష్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక చెరుకూరి గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గౌరవం, నిబద్ధతకు తగిన గుర్తింపు ఇచ్చేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తల ఆధారంగా ముందుకు సాగిందని, కార్యకర్తలే పార్టీకి పునాదులని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే వారే భవిష్యత్ నాయకులని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. బొడ్డు వెంకటరమణ చౌదరి లాంటి అనుభవం, అంకితభావం ఉన్న నాయకత్వంతో తూర్పుగోదావరి జిల్లాలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం కార్యకర్తల కష్టాన్ని ఎన్నడూ విస్మరించదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో జిల్లాలో తెలుగుదేశం పార్టీ మరింత బలంగా నిలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తన కష్టాన్ని గుర్తించి జిల్లా అధ్యక్షునిగా ఇచ్చిన బాధ్యతలను మరింత సమర్థవంతంగా పనిచేస్తానని నూతన అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, కూటమి పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పీజిఆర్ఎస్ వేదికను సద్వినియోగం చేసుకోవాలి


### జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీ.జి.ఆర్.ఎస్)ను అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యథావిధిగా మీ కోసం కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. అర్జీదారులు మీ కోసం వెబ్‌సైట్ ద్వారా పీ.జి.ఆర్.ఎస్ అర్జీలను నమోదు చేసుకుని సమస్యలకు పరిష్కార మార్గాలు పొందవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మీ కోసం ప్రజా వేదికలో సమర్పించిన అర్జీల స్థితిని (1100) టోల్ ఫ్రీ ఫోన్ నంబర్కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అర్జీలను మీ కోసం వెబ్‌సైట్‌లో గానీ, నేరుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీ.జి.ఆర్.ఎస్)లో గానీ సమర్పించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయిలో, డివిజన్ కార్యాలయాల్లో డివిజన్ స్థాయిలో, మండల కార్యాలయాల్లో మండల స్థాయిలో, అలాగే పురపాలక సంఘాల్లో పురపాలక స్థాయి అధికారులతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. అర్జీదారులు తమ సమస్యలను మీ కోసం డాట్ ఏపీ. జిఓవి. ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజల సమస్యలను స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం





**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ముమ్మిడివరం మండలం సిహెచ్ గున్నేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా, భక్తుల నడుమ ఘనంగా జరిగింది. ఈ నెల 4వ తేదీ నుండి ప్రారంభమైన అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నాటి తీర్థం, ఊరేగింపుతో విజయవంతంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు కొనసాగిన జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించబడ్డాయి. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. జాతర కాలంలో ప్రతిరోజూ అమ్మవారిని భిన్నమైన అలంకరణలతో దర్శనమిచ్చి భక్తుల మనసులను అలరించారు. ప్రత్యేక పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో జాతర మహోత్సవాలు మరింత శోభాయమానంగా మారాయి. తీర్థ మహోత్సవం సందర్భంగా సుమారు రెండు వేల మందికి పైగా కళాకారులు పాల్గొని భాజా బజంత్రీలు, బ్యాండ్ మేళాలు, గరగ నృత్యాలు, బుట్టబొమ్మల వేషధారణలు, కేరళ సంప్రదాయ వాయిద్యాలు, తీన్మార్ డప్పులు, గిరిజన నృత్యాలు, జానపద నృత్యాలు, శక్తి వేషాలు, ఆదివాసీ నృత్యాలు తదితర కళారూపాలతో ఊరేగింపును కనువిందుగా నిర్వహించారు. వివిధ దేవతా మూర్తుల వేషధారణలతో కళాకారులు అమ్మవారిని బాణాసంచా కాల్పుల మధ్య ఘనంగా ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ తీర్థ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా పరిసర జిల్లాల నుండి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తుల రద్దీతో గున్నేపల్లి గ్రామ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. కీర్తన, ఊరేగింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముమ్మిడివరం ఎస్ఐ డి. జ్వాలా సాగర్, అయిపోలవరం ఎస్ఐ ఎం.వి.వి. రవీంద్రబాబు, కాట్రేనికోన ఎస్ఐ అవినాష్‌ల ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తీర్థం సందర్భంగా పల్లంకుర్రు వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. మొత్తంగా శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం భక్తిశ్రద్ధలు, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవంతో అత్యంత విజయవంతంగా ముగిసింది.

# పెద్దింటి కృష్ణవంశీకి సత్కారం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ జిల్లా కొత్తపేటకి చెందిన సినీనటుడు పెద్దింటి కృష్ణవంశీ గతంలో పెన్సిల్ ముల్లుపై శుద్ధ ముక్కలుపై బొమ్మలు చెక్కి మైక్రోఆర్ట్స్ ద్వారా 20 ప్రపంచ రికార్డులు సాధించారు అనంతరం సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టి 10 సినిమాలు పైగా చేసిన కృష్ణ వంశీని హైదరాబాద్ లో జాతీయ రాహుల్ ప్రియాంక గాంధీసేన ప్రెసిడెంట్ పండిట్ జగదీష్ శర్మ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పొలిటికల్ లెడర్ మోహన్ కృష్ణ, పి.సుబ్బారావు, ప్రగాఢ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి, జ్ఞాన సరస్వతి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వాడపాలెం శ్రీ అయ్యప్ప స్వామి జ్ఞాన సరస్వతి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉత్సవాల్లో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అయ్యప్ప స్వామి, జ్ఞాన సరస్వతి దేవి, పరివారదేవతలను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# జిల్లాలో రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం : జిల్లా ఎస్పి రాహుల్ మీనా



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పి రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్లకు పిలిపించి ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమం ద్వారా జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటం, రౌడీ షీటర్లు పాత నేర చరిత్రను విడిచిపెట్టి మంచి జీవనం గడపేలా మార్గనిర్దేశం చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టంగా హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉండి గౌరవప్రదమైన జీవనోపాధిని ఎంచుకోవాలని రౌడీ షీటర్లకు సూచించారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనాలంటే ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని, పోలీసుల సహకారం అవసరమని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో అసాంఘిక శక్తులు, రౌడీయిజం, గూండాయిజానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండదని స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడే వారు, పాత నేరాలను పునరావృతం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమం ద్వారా రౌడీ షీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# లడ్డు కల్తీ మహాపాపం.. తగిన మూల్యం తప్పదు

### తిరుమల లడ్డు ప్రసాదం రాజకీయాలు మంచి పరిణామాలు కావు – తప్పు జరిగితే అధికారికంగా చర్యలు చేపట్టకుండా రాజకీయాలా..? దీనిపై చర్చలు కొనసాగించటం మహా పాపం – ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల లడ్డు ప్రసాదం రాజకీయాలు మంచి పరిణామాలు కావు అని, మత ప్రచార హక్కుపై రాజ్యాంగ సవరణ జరగాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో రాసాయనాలు, జంతువుల కొవ్వు ప్రదార్ధాలు కలిసినట్టు కొన్ని రోజులుగా విష రాజకీయ ప్రచారం జరుగుతుందన్నారు. ఏది నిజమో చెప్పగల దమ్మున్న ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రంలో లేదన్నారు. నిజంగా లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగితే ఆ మహా పాపానికి ప్రాయచిత్తం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.భక్తుల విశ్వానికే ఎంతో శక్తి వంతమైన దైవం కలియుగ శ్రీ వేంకటేశ్వరస్వామి వారు అని మరిచి కలుషిత రాజకీయాలను ఆపాదించాలి అనుకుంటే ఆ మహా దైవం ఆగ్రహానికి గురికాక తప్పదాన్నారు. శ్రీ కలియుగ శ్రీనివాసునితో చతుర్లు ఆడితే మట్టికొట్టుకు పోవటం ఖాయం అని ఆయన హెచ్చిరించారు. తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందా ! జరగలేదా అనే నిజాన్ని శాస్త్రీయ పరంగా నిరూపించాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ రచ్చకు తెరలేపటం ఆశ్యస్పందంగా ఉండన్నారు. చంద్రబాబు కూటమి పాలక వర్గంలో ఉన్నట్టు మరిచిపోయారా! లేక ప్రతిపక్షం లోనే వున్నట్టు భ్రమలో వున్నారో అర్ధం కావటంలేదాన్నారు. నిజాన్ని అధికారికంగా నిర్ధారించలేని నిస్సహాయ స్థితిలో చంద్రబాబు కూటమి సర్కార్ వుందా అనే అనుమానాలు కలియుగ శ్రీనివాసుని భక్తులకు కలుగుతున్నాయన్నారు. కేంద్రం సైతం రాజకీయాలకు ప్రాధాన్యతను ఇంచ్చుకుంటు నిజాన్ని నిగ్గు తేల్చలేని అసమర్ధతను మోదీ సర్కార్ చాటుకుంటుందన్నారు . ప్రపంచ ఆరాధ్య దైవం వేల, లక్షల కోట్ల భక్తుల విశ్వాసాన్ని చూరగొంటున్న కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం పై ఎన్ని కుట్రలు కుతంత్రాలు జరిపినా భక్తుల విశ్వాసం ఏ మాత్రం శ్రీ వారిపై సన్నగిల్లదని , నాటి త్రేతా యుగానికి , ద్రోపరి యుగానికి మూల విరాట్టులే నేటి కలియుగ దైవం ప్రతిరూపమే ఈ నాటి శ్రీవారు మాత్రమే ప్రత్యేక్ష దైవం అని యావత్ ప్రపంచ మనవాళి అపర విశ్వాసాన్ని కలియుగ దైవం శ్రీనివాసుడు పొందుతున్నారని ఆయన అమిత విశ్వాసాన్ని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని విదేశీ మతోన్మాద ఉగ్రవాద శక్తులు హిందూ ధర్మం పై కుట్రలు చేస్తున్నాయి.ఎన్ని దాడులు , ఆక్రమణలు సాగించినా నేటికి హిందూ ధర్మం చెక్కు చెదరలేదని, సనాతన హిందూ ధర్మం ప్రకృతితో మమేకమైన ఒక మహోన్నత శక్తి అని, ఇప్పటికే అమెరికా, యూరప్, సింగపూర్ వంటి దేశాల్లో లక్షలాది మంది ఇతర మతస్తులు హిందూ ధర్మం వైపు ఆకర్షితులు అవుతున్నారన్నారు. ఈ మధ్య కొంతమంది అజ్ఞానులు వేదికలపై నుదిటిన బొట్టు పెట్టుకున్న హిందువుల మనోభావాలను గాయపరిచే విధంగా మాటలు తూలున్నారన్నారు. శృతి మించిన మత ప్రచార హక్కు భారతదేశ సార్వభౌమాధికారానికి , జాతీయ సమగ్రతకు ప్రమాదంగా మారాయన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 25, 26 లను రద్దు అయినా చేయాలి. లేకుంటే సవరణలు అయినా జరపాలని ఆయన సూచించారు. శ్రీవారి లడ్డు ప్రసాదం పై రాజకీయ రచ్చను , అధికారంలో ఉండి నిగ్గు తేల్చని పాలకులను శ్రీ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి అంతర్గత నేత్రంతో గమనిస్తున్నారని , తప్పు చేసిన వారు , తప్పును కాపాడుతున్న వారు , గోడ మీద పిల్లి పాత్ర పోషిస్తున్న వారిని ఎవ్వరిని వదిలిపెట్టరని , తిరుమల క్షేత్రంను కేంద్ర బిందువుగా చేసుకుని ఎన్ని కుట్రలు చేసినా నా నాటికి శ్రీ వారి పై భక్తుల విశ్వాసం పెరుగుతుందే గాని తరగదు అనే నిజాన్ని మూర్ఖులు తెలుసుకోవాలన్నారు. శ్రీ వేంకటేశ్వరస్వామి వారు ఆంధ్రప్రదేశ్ లో కొలువై ఉండటం యావత్ ఆంధ్రులు అదృష్టంగా బావిస్తారని , ఈ కలియుగానికి ప్రపంచం మొత్తంగా శ్రీనివాసులు వారే ప్రత్యేక్ష దైవం అని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ విశ్వాసాన్ని వ్యక్త పరిచారు. సభకు ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి , దుద్దే త్రినాద్ , సిమ్మా దుర్గారావు , దుద్దే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , ఆకుల మణికాంత్ , మేడిచర్ల శ్రీనివాసరావు , వాడపల్లి జ్యోతిష్ , గుడ్ల సాయి దుర్గాప్రసాద్ , బసా సోనియా , సుంకర భాస్కర వెంకట రంగారావు , వల్లి శ్రీనివాసరావు, ఎస్ కె బాజాని , కందివలస రమణ , నాగూరు దుర్గ , మాసా నూకరాజు , మాసా లక్ష్మి, మాసా అప్పాయమ్మ , చల్లా సాంబశివరావు,చల్లా అఖిల్,పేరెడ్డి కొండలరావు, బర్ల సతీష్ ,ముప్పిడి బద్రి తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి


# వైసీపీ నేత కుంచే రమణారావు ఆర్థిక సాయం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ఉప్పలగుప్తం మండలం గోపవరం తిరుమల చెరువు ప్రాంతానికి చెందిన కొంకి ప్రకాశరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న అమలాపురం అసెంబ్లీ నియోజక వర్గ వైసీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు ఆదివారం ఆయనను పరామర్శించారు. ప్రకాశరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న రమణారావు, అవసరమైన వైద్య చికిత్స కోసం ఆయనకు వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పేదలు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడమే తన ధ్యేయమని రమణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొంకి ఏడుకొండలు, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, నాయకులు కుంచే బాబులు, మధుర వెంకటేష్, పందిరి సుబ్బరాజు, పరమట రాజశేఖర్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రమణారావు చేపడుతున్న సేవా కార్యక్రమాలను గ్రామస్థులు ఈ సందర్భంగా అభినందించారు.

# దరియాలతిప్పలో యువత బలం యువజన సమావేశం




**యానాం, విశ్వం వాయిస్ న్యూస్ :** మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో దొమ్మేటిపేట, సీతారాం నగర్, ఉదయ కృష్ణ కాలనీ, దరియాలతిప్ప, బాలయోగి కాలనీ ఐదు గ్రామాల యువత ఆదివారం దరియాలతిప్ప గ్రామంలో "యువత బలం" అనే పేరుతో భారీ యువజన సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఐదు గ్రామాల నుంచి సుమారు 375 మంది యువత పాల్గొన్నారు. వీరిలో దాదాపు 300 మంది 2021 శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పని చేసినవారే కావడం ప్రత్యేకంగా గమనించదగిన విషయం. సమావేశంలో పాల్గొన్న యువత మాట్లాడుతూ, 2021 శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను నమ్మి ఓటు వేసినప్పటికీ, ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఒక్క హామీ కూడా అమలు కాలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాల్లో కనీసం దర్శనమూ ఇవ్వకపోవడం, ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించడం వల్ల ఎమ్మెల్యేపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువత ఏకగ్రీవంగా మాట్లాడుతూ "2021లో చేసిన తప్పును ఈసారి మళ్లీ చేయము" అని స్పష్టం చేస్తూ, రాబోయే ఎన్నికల్లో తమ రాజకీయ ప్రయాణం పూర్తిగా మల్లాడి కృష్ణారావుతోనే ఉంటుందని ప్రకటించారు. ఈ "యువత బలం" సమావేశం ద్వారా ఐదు గ్రామాల యువత తమ రాజకీయ చైతన్యాన్ని, మార్పు పట్ల ఉన్న నిబద్ధతను, ప్రజల పక్షాన నిలబడే నాయకత్వం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మల్లాడి అభిమానులు పాల్గొన్నారు.

# ఆవెల్తిలో తాటాకుల గృహం దగ్ధం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వేళంగి పంచాయతీ పరిధిలోని అవెల్తి గ్రామంలోని గోము చెల్లెమ్మ నివసిస్తున్న తాటాకిల్లు ఆదివారం ఇల్లు మొత్తం పూర్తిగా కాలి పోయింది. ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో చెల్లెమ్మ బహిర్భూమికి వెళ్లగా అదే సమయంలో వంట చేసుకునే పొయ్యి నుండి మంటలు చెలరేగి ఈ అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంట్లోని ఆధార్ కార్డులు, రైస్ కార్డులు, కొంత నగదు, మెత్తం సామాగ్రి, దుస్తులు కాలిపోయాయి. సుమారు రూ. 80,000 వరకు ఆస్థి నష్టం సంభవించింది. ప్రాణ నష్టం ఏమీ జరుగ లేదు.

# పలువురికి ఆర్థిక సహాయం అందించిన తాళ్ళరేవు జడ్పిటిసి

**తాళ్ళరేవు, విశ్వంవాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం జడ్పిటిసి సభ్యుడు సాగర్ ఇబ్బందుల్లో ఉన్న కొందరికి ఆర్థిక సహాయం అందించారు. వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్న సతీష్, అనారోగ్యంతో ఉన్న నాని, కాలికి సర్జరీ చేయించుకున్న రాజును పరామర్శించి ఆర్థిక సహాయం అందించి, సమాజం పట్ల తన ఉదారతను చాటుకున్నారు. ఆయన వెంట పెట్ల సూర్యనారాయణ, దడాల జగదీశ్వరరావు, పేర్ని ఆదినారాయణమూర్తి, శాంత కుమారి ఉన్నారు.

# క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏంటీ?

## దాంతో ఏంటి ప్రయోజనం?




ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "గతంలో సిలికాన్ వ్యాలీ ఐటీ విప్లవానికి నాంది పలికితే రాబోయే రోజుల్లో క్వాంటం వ్యాలీ ప్రపంచాన్ని శాసించబోతోంది. 'ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సరికొత్త చరిత్రకు వేదికైంది. ఐటీ రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు అమరావతిని భవిష్యత్ టెక్నాలజీ 'క్వాంటం కంప్యూటింగ్'కు గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా అడుగులు వేశారు. శనివారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో దేశంలోనే మొట్టమొదటి 'అమరావతి క్వాంటం వ్యాలీ' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

సిలికాన్ వ్యాలీ గతం.. క్వాంటం వ్యాలీ వర్తమానం!

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "గతంలో సిలికాన్ వ్యాలీ ఐటీ విప్లవానికి నాంది పలికితే రాబోయే రోజుల్లో క్వాంటం వ్యాలీ ప్రపంచాన్ని శాసించబోతోంది. హైదరాబాద్‌కు హైటెక్ సిటీ ఎలాగో, దేశానికి అమరావతి క్వాంటం వ్యాలీ అలా గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరావతిలో దేశంలోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తెస్తాం" అని ప్రకటించారు. ప్రాజెక్టు ప్రత్యేకతలు: సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. 48 అంతస్తులు, 29 అంతస్తులతో కూడిన ఎనిమిది భారీ టవర్లను నిర్మిస్తున్నారు. ఐబీఎం , టీసీఎస్ , ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్నాయి. 2030 నాటికి దేశానికి అవసరమైన 2.5 లక్షల క్వాంటం నిపుణులలో మెజారిటీ వాటా అమరావతి నుంచే ఉండేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎందుకు ఈ క్వాంటం టెక్నాలజీ? సాధారణ కంప్యూటర్లు సంవత్సరాల తరబడి చేసే క్లిష్టమైన లెక్కలను క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్లలో పూర్తి చేస్తాయి. దీనివల్ల వాతావరణ అంచనాలు, క్యాన్సర్ వంటి వ్యాధులకు కొత్త మందుల తయారీ, హ్యాకింగ్‌కు గురికాని సైబర్ సెక్యూరిటీ, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. అరుదైన పురస్కారం.. ?100 కోట్ల బహుమతి! పరిశోధనలను ప్రోత్సహించేందుకు చంద్రబాబు ఒక సంచలన ప్రకటన చేశారు. క్వాంటం టెక్నాలజీ రంగంలో ఎవరైనా నోబెల్ బహుమతి సాధిస్తే వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ?100 కోట్ల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అమరావతే నాలెడ్జ్ హబ్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

దారుణం...

# 'పేరెంట్స్ ని కాదని పెళ్లి చేసుకున్నవారికి ఓ గుణపాఠం'!



అవును... తిరుపతి జిల్లా పుత్తూరు మండలం నేషనూరుకు చెందిన కన్నెప్పరెడ్డి కుమార్తె పద్మ (28).. తోరూరుకు చెందిన శివశంకర్ డిగ్రీ చదువుకునే రోజుల నుంచీ మంచి స్నేహితులు. ఈ రోజుల్లో తల్లి తండ్రులు సంబంధాలు చూసి, వారి అనుమతితో పెళ్లిల్లు చేసుకునేవారు ఉండగా.. ఒకరినొకరు ప్రేమించుకుని ఇరు కుటుంబాల అంగీకరంతో వివాహాలు చేసుకునేవారూ ఉన్నారు. ఇదే క్రమంలో.. తల్లితండ్రులను కాదని బయటకు వెళ్లి ప్రేమ వివాహాలు చేసుకునేవారికీ కోదవ లేదు! ఈ క్రమంలో తాజాగా తల్లితండ్రులను కాదని పెళ్లి చేసుకున్న ప్రతి ఒక్కరికీ తన జీవితం ఓ గుణపాఠం అంటూ ఓ వివాహిత రాసిన ఆత్మహత్య లేఖ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అవును... తిరుపతి జిల్లా పుత్తూరు మండలం నేషనూరుకు చెందిన కన్నెప్పరెడ్డి కుమార్తె పద్మ (28).. తోరూరుకు చెందిన శివశంకర్ డిగ్రీ చదువుకునే రోజుల నుంచీ మంచి స్నేహితులు. ఈ క్రమంలో స్నేహం పెరిగి, ప్రేమగా మారింది. ఈ క్రమంలో వీరిద్దరూ లవ్ మ్యారేజ్ చేసుకునేందుకు సిద్ధపడగా.. కులాలు వేరు కావడంతో పాటు శివశంకర్ పనిలేక జులాయిగా తిరుగుతున్నాడని పద్మ తల్లితండ్రులు అంగీకరించలేదు. అయినప్పటికీ లవ్ మ్యారేజ్ విషయంలో పద్మ వెనక్కి తగ్గలేదు. ఈ క్రమంలో 2019లో శివశంకర్ ని వివాహం చేసుకుంది. వీరికి తేజ (6), లాస్య (5) కుమార్తెలు ఉన్నారు. వీరిద్దరూ స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో శివశంకర్ జులాయిగా తిరుగుతూ ఇంటి ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదంట. దీంతో.. డ్వాక్రా గ్రూపు సభ్యురాలైన పద్మ.. లోన్ తీసుకున్నారు. పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి ఖర్చుల విషయాలను శివశంకర్ పూర్తిగా వదిలేశాడట. దీంతో.. ఇటీవల అతన్ని పెద్దమనుషులు మందలించారని అంటున్నారు. ఈ క్రమంలో శనివారం బయటకు వెళ్లిన భర్తకు ఫోన్ చేసిన పద్మ... డ్వాక్రా అప్పు గురించి ప్రశ్నించింది. అయితే.. తాను అప్పు చెల్లించలేదని శివశంకర్ చెప్పడంతో పద్మ తీవ్ర మనస్తాపం చెందింది. ఈ సమయంలో.. ఆత్మహత్య లేఖ రాసి.. ఇద్దరు పిల్లలకు ఉరేసి చంపి, తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే.. సాయంత్రం ఇంటికొచ్చిన శివశంకర్.. తలుపులు వేసి ఉండటంతో పాటు, ఎంతకూ తలుపులు తీయకపోవడంతో పద్మ తండ్రికి ఫోన్ చేశాడు. ఆయన వచ్చి తలుపులు పగలగొట్టి చూసే సరికి.. బెడ్ రూమ్ లో పిల్లలు, హాల్ లో పద్మ విగతజీవులుగా ఉరికి వేలాడుతున్నారు. ఈ సందర్భంగా ఆమె రాసిన ఆత్మహత్య లేఖ సంచలనంగా మారింది. భర్త ఆర్థిక పరిస్థితి.. తన పరిస్థితి.. ఇంటిని నడపడం, పిల్లలను చదివించడంలో పడుతున్న ఇబ్బందులతో పాటు.. తల్లితండ్రులను కాదని పెళ్లి చేసుకున్న ప్రతి ఒక్కరికీ తన జీవితం ఓ గుణపాఠం అంటూ ఆమె పేర్కొన్న విషయాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా... తల్లి తండ్రులను కాదని పెళ్లి చేసుకున్న ప్రతి ఒక్కరికీ తన జీవిత ఓ గుణపాఠమని.. ఒక అమ్మాయి ఎలాంటి లక్షణాలు తన భర్తకు ఉండకూడదని అనుకుంటుందో.. అలాంటి లక్షణాలన్నీ తన భర్తలో ఉన్నాయని.. ఇది తాను కలలో కూడా ఊహించనిదని తెలిపింది. శివశంకర్ ను లవ్ మ్యారేజ్ చేసుకున్న పాపానికి తాను ఎంత కష్టపడిదీ తనకే తెలుసని.. తనతో పాటు పిల్లలు కూడా ఆ కష్టాన్ని అనుభవిస్తున్నారని ఆమె ఆ లేఖలో పేర్కొంది.

# కూటమి కమ్మగా ఉంది

## బీజేపీ నేత ఆది సంచలన వ్యాఖ్యలు



కాంగ్రెస్‌లో పుట్టి వైసీపీలో కొనసాగి టీడీపీ మీదుగా బీజేపీలో చేరిన కడప జిల్లా జమ్మలమడుగు ఆదినారాయణ రెడ్డి అంటే రాజకీయాల గురించి అవగాహన ఉన్న వారికి తెలిసిన విషయమే. హాట్ కామెంట్స్ చేయడంతో ముందుంటారు. తాజాగా ఆదివారం కడప జిల్లా జమ్మలమడుగులో నిర్వహించిన బీజేపీ సమావేశంలో ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మీద సంచలన కామెంట్స్ చేశారు. సొంత పార్టీ మీద ఆయన మాట్లాడారు. కూటమి ఏలుబడిలో అంతా కమ్మ కమ్మగా ఉందంటూ ఆదినారాయణ రెడ్డి మాట్లాడటం విశేషం.

**ఎన్టీఆర్ హయాం కంటే :**

అప్పట్లో పత్రికా ప్రముఖుడు గజ్జల మల్లారెడ్డి 1983లో ఎన్టీఆర్ పాలన గురించి మాట్లాడుతూ కమ్మగా ఉందని చెప్పేవారని, ఇపుడు ఏపీలో కూటమి పాలన అంతకంటే కమ్మగా ఉందని ఆదినారాయణరెడ్డి పోల్చి చెప్పడం మరో విశేషం. కమ్మగా ఉందంటే మీ అందరికీ అర్థమైంది కదా అని ఆదినారాయణ రెడ్డి పార్టీ క్యాడర్ కి రెట్టించి మరీ అడగడం గమనార్హం.

**కమ్మతనం పోవాలి :** కూటమి పాలనలో కమ్మతనం పోవాలని ఆదినారాయణ రెడ్డి చెప్పుకొచ్చారు. కమ్మతో పాటు అన్ని కుల్లాలు ఉన్నాయని గుర్తించాలని అన్నారు పనిచేసే వారికే పదవులుఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. అందరికీ న్యాయం చేయాలని కూడా ఆయన గట్టిగా కోరుతున్నారు.

**బీజేపీ లేకపోతే :** ఏపీ రాజకీయాల్లో బీజేపీ చాలా ప్రధానమైనది అని ఆదినారాయణ రెడ్డి చెప్పడం విశేషం. బీజేపీ లేకపోతే టీడీపీ జనసేన లేనే లేవని ఆయన అన్నారు. అంటే బీజేపీ కేంద్రంలో ఉంటూ తన బలాన్ని ఏపీకి అందిస్తోందని ఆయన చెప్పదలచారు అన్న మాట. అంతే కాదు బీజేపీకి ఏపీ రాజకీయాల్లో రావాల్సినంత గుర్తింపు కానీ ఇవ్వాల్సినంత ప్రాముఖ్యత కానీ ఇవ్వడం లేదని కూడా ఆదినారాయణ రెడ్డి భావనగా ఉంది అని అంటున్నారు.

**అసంతృప్తి ఉందా :** ఏపీలో పదవుల విషయంలో బీజేపీకి అన్యాయం జరుగుతోంది అని గతంలో ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కూడా ప్రస్తావించారు. ఇపుడు అదే పార్టీకి చెందిన ఆదినారాయణ రెడ్డి సైతం అంటున్నారు. అందుకే ఆయన ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హాజరైన సమావేశంలో మాట్లాడుతూ ఈ రకంగా బీజేపీకి పదవులు అంటూ గుర్తు చేశారు అని అంటున్నారు. అదే సమయంలో బీజేపీ లేకపోతే కూటమి లేదు, ఎవరూ లేరు అన్నట్లుగా ఒక సందేశాన్ని పంపించారు అని అంటున్నారు. ఇక కూటమిలోని మిత్రులుగా ఉన్న జనసేనలో పదవుల విషయంలో ఆవేదన ఉందని అంటున్నారు. బీజేపీ కూడా ఇదే విషయం మీద మధన పడుతోంది అంటే కూటమి పెద్దలు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని అంటున్నారు. ఏది ఏమైనా ఆదినారాయణ రెడ్డి చేసిన హాట్ కామెంట్స్ చర్చనీయాంశం అవుతున్నాయి.

# జగన్ విషయంలో షర్మిల అలా... తులసిరెడ్డి ఇలా !



వైఎస్ జగన్ ని ఆయన సోదరి కాంగ్రెస్ ఏపీ విభాగం అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శిస్తూనే ఉంటారు. ఆమె తాజాగా విజయవాడలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో పాదయాత్ర జగన్ ఎందుకు చేస్తున్నారు అని ప్రశ్నించారు. జగన్ మళ్ళీ అధికారంలోకి రారు అని కూడా సీరియస్ కామెంట్స్ చేశారు. ఆయన అహంకారం తగ్గించుకోవాలని పూర్తిగా మారాలని సూచనలు కూడా చేశారు. ఇక అదే కాంగ్రెస్ లో సీనియర్ నేత తులసిరెడ్డి మాత్రం జగన్ విషయంలో కొంత సాఫ్ట్ కార్నర్ చూపించడం విశేషం. ఒక ఒకే సమయంలో షర్మిల జగన్ ని చంద్రబాబుని కలిపి విమర్శలు చేస్తున్న వేళ తులసి రెడ్డి జగన్ విషయంలో చంద్రబాబు వైఖరిని పూర్తిగా తప్పుపడుతూ మాట్లాడటం రాజకీయ విశేషంగానే చూడాలని అంటున్నారు.

**ఇంతకీ ఏమన్నారు అంటే :**

ఏపీలో ఇపుడు హాట్ టాపిక్ గా లడ్డూల కల్తీ వ్యవహారం సాగుతోంది. దీని మీద కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి ఫైర్ అయ్యారు. జగన్ మీద రాజకీయ కక్ష కోసం చంద్రబాబు పవిత్రమైన తిరుమల లడ్డూతో రాజకీయం చేస్తున్నారు అని విమర్శించారు. దేశంలో అత్యున్నత సంస్థ అయిన సీబీఐ తన చార్జ్ షీట్ లో లడ్డూలో జంతు కొవ్వు కలవలేదు అని చెప్పింది అని గుర్తు చేశారు, అదే సమయంలో పాం ఆయిల్ సహా ఇతర పదార్ధాలు కలిసాయని దాంతో 20 కోట్లకు పైగా లడ్డూలు చేశారని నెయ్యి అన్నది ఎక్కడా వాడలేదని కూడా పేర్కొంది అని గుర్తు చేశారు.

ఇక అవినీతి జరిగిందని 250 కోట్ల మేర నష్టం జరిగిందని తేల్చిందని కూడా చెప్పారు. అందువల్ల ప్రభుత్వం అవినీతి చేసిన వారి మీద తప్పుడు విధానం అవలంబించిన వారి మీద చర్యలు తీసుకోకుండా లడ్డూల విషయంలో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బ తినేలా వ్యవహరించడమేంటి అని తులసీరెడ్డి ప్రశ్నించారు. ఎంత ఎక్కువగా లడ్డూ విషయం టీడీపీ మాట్లాడితే అంతలా ఆ పార్టీకి శ్రీవారి లడ్డూకి టీటీడీకే నష్టం అని కాంగ్రెస్ పెద్దాయన స్పష్టం చేశారు.

**మోడీ దత్తపుత్రుడు అంటూ :** ఇక షర్మిల అయితే రాయలసీఅంకు చంద్రబాబు జగన్ ఇద్దరూ ద్రోహం చేశారని నిప్పులు చెరిగారు. తమ సొంత ప్రయోజనాల కోసం సీమ ప్రజల ప్రయోజనాలను ఇద్దరు నేతలూ తాకట్టు పెట్టారని ఆమె మండిపడ్డారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ విషయంలో ఇద్దరి వైఖరి తప్పు అని ఆమె స్పష్టం చేశారు. గత అయిదేళ్ళు వైసీపీ తన పాలనలో నిద్రపోయిందా ఇపుడు ఉద్యమాలు చేస్తోంది అని షర్మిల జగన్ ని ఘాటు గానే ప్రశ్నించారు. ఐదేళ్ళు ప్రధాని మోడీ దత్తపుత్రుడుగా జగన్ ఉన్నారని షర్మిల విమర్శించారు. జలయజ్ఞం ప్రాజెక్టులను తాము అధికారంలోకి వస్తే కేవలం ఆరు నెలలలోనే పూర్తి చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్ సీఎం అయ్యాక కనీసం రాయలసీమ ప్రాజెక్టుల వైపు కన్నెత్తి కూడా చూడలేదని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఎక్కడా లడ్డూ కల్తీ గురించి కానీ ఏపీలో జరుగుతున్న హీటెడ్ డిస్కషన్ గురించి కానీ మాట్లాడలేదు, సీమ ద్రోహులు బాబు జగన్ అంటూ తన విమర్శలు కొనసాగించారు. దీంతో కాంగ్రెస్ లో షర్మిల ఒకలా తులసిరెడ్డి మరోలా వ్యాఖ్యలు చేయడం మీద చర్చ సాగుతోంది.



# ప్రైవేటు పాఠశాల బస్సు దగ్ధం

## విద్యార్థులకు తప్పిన ప్రమాదం - కాలిపోతున్న బస్సు

**చిట్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రమాదవశాత్తు ఓ ప్రైవేటు పాఠశాల బస్సులో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. డ్రైవర్, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పిల్లలకు అపాయం తప్పింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. చల్లగరిగె గ్రామంలోని రైజింగ్ సన్ పాఠశాలకు చెందిన బస్సు శనివారం సాయంత్రం విద్యార్థులను జూకల్, తిరుమలాపూర్ గ్రామాల్లో దింపేందుకు బయలుదేరింది. జూకల్ దాటిన తర్వాత బస్సులో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు అంటుకున్నాయి. గమనించిన డ్రైవర్ సాంబయ్య, సిబ్బంది త్రిలోక్‌రెడ్డి అప్రమత్తమై అందులో ఉన్న 15 మంది విద్యార్థులను కిందకు దించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు.

ఘనంగా తెలుగుదేశం పార్టీ

# జిల్లా కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం

**వంద శాతం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి న్యాయం చేస్తా**
**కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తా...**
**జిల్లాలో ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కలిసి పని చేయడం నా అదృష్టం - భారీ ర్యాలీగా తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తనపై నమ్మకం ఉంచి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శాఖ మంత్రి నారాలోకేష్ లకు రుణపడి ఉంటానని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రుడా చైర్మన్ రాజానగరం ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పేర్కొన్నారు. ఆదివారం రాజమండ్రి చెరుకూరి కళ్యాణ మండపంలో తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా బూరుగుపూడి గేటు వద్ద గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున ర్యాలీగా బయలుదేరి చెరుకూరి కళ్యాణ మండపం కు చేరుకున్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రుడా చైర్మన్, రాజానగరం ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ప్రధాన కార్యదర్శిగా కాశీ నవీన్ తదితర 42 మంది కార్యవర్గంతో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు, శాసనమండలి మాజీ ఉపసభాపతి రెడ్డి సుబ్రమణ్యం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ 2029లో తెలుగుదేశం పార్టీని రాష్ట్రంలో మళ్లీ కూటమిగా అధికారంలోకి తేవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు బొడ్డు వెంకటరమణ చౌదరి పిలుపు ఇచ్చారు. మనది భూతుల పార్టీ కాదని సిద్ధాంతాలు, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తల సైన్యంతో నిరంతరం పనిచేసే శక్తి ఉన్న పార్టీ అని వ్యాఖ్యానించారు .మాజీ ముఖ్యమంత్రి టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు సిద్ధాంతాలను పాటిస్తూ అందరూ ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఉన్న ఎమ్మెల్యేలు,సీనియర్ నాయకులు, కలుపుకుని పార్టీని ముందుకు నడిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. వారితో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరుల అండతో కూటమి ప్రభుత్వ విధానాలను, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కార్యకర్తలకు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ సహకారంతో జిల్లాలో పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేసేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామని వెల్లడించారు. టిడిపి, బిజెపి, జనసేన కూటమి నాయకులు భారీ ఎత్తున తరలివచ్చి నూతన కార్యవర్గానికి పుష్ప గుచ్చాలు అందజేసి దుస్సాలువాతో అభినందన సత్కారాలు చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవం లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జోన్ - 2 కోఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మహాసేన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రవీంద్ర భారతిలో అవార్డు, సన్మానం పొందిన శ్రీ మహతి విద్యార్థులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సర్ సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డు ఒలింపియాడ్ ఎగ్జామ్ రిజల్ట్స్ లో పిట్టా శివారెడ్డి ఐఐటి స్టేట్ నాలుగో ర్యాంకు మరియు డిస్ట్రిక్ఒకటవ ర్యాంకు సాధించి హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ యాక్టర్ శ్రీకాంత్, శివాజీ రాజా మరియు తెలంగాణ,ఏపీ మినిస్టర్స్ చేతుల మీదుగా అవార్డు పొంది ఘనంగా సత్కరించారని కరస్పాండెంట్ ఏ శ్రీనివాస్ తెలియజేశారు. వరుసగా పదోసారి తమ విద్యార్థులు స్టేట్ ర్యాంకులు మరియు సత్కారం పొందారని తూర్పుగోదావరి జిల్లాలో ఏ స్కూలు ఈ ఘనత సాధించలేదని ఒలింపియాడ్ విద్యలో ప్రత్యేక ప్రణాళిక ద్వారా ఈ విజయాలు సాధించామని ఐఐటి అకాడమిక్ డైరెక్టర్ ఏ. ఎస్.రాంప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సివి రామన్ ఫౌండర్ డా. వై కిషోర్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను, స్టాఫ్ ను ప్రత్యేకంగా అభినందించారు.

# కోఆర్డినేటర్‌ను నియమించే అధికారం వెంకట్‌కు లేదు

**కాంగ్రెస్‌లో వర్గాలను పెంచడం సరికాదు - వెంకట్‌కు ఆ అధికారం ఎక్కడిది?**
**సిటీ అధ్యక్షుడు లేకుండా నగరంలో సమావేశాలు ఎలాగ నిర్వహణ..?**
**కాంగ్రెస్ పార్లమెంట్ కోఆర్డినేటర్ టి.కె, నగర అధ్యక్షులు బాలేపల్లి**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు ఎవరైనా సరే పార్టీ నియమ నిబంధనలు అనుసరించి మాత్రమే పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ కోఆర్డినేటర్ టికె విశ్వేశ్వరరెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్‌లు సూచించారు. స్థానిక మున్సిపల్ కాలనీలో గల పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిటీ కోఆర్డినేటర్ వంటి పదవులను పిసిసి నియమించాలే తప్ప, జిల్లా అధ్యక్షునికి నియమించే అధికారం ఉండదన్నారు. ఇటీవల జిల్లా అధ్యక్షులు వెంకట్ నియమించిన నియామకాలు చెల్లవని స్పష్టం చేశారు. సిటీ అధ్యక్షుల బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య సముపార్జనకు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని, ఆ పార్టీకి ఒక క్రమశిక్షణ, ఒక నిబంధనలు అంటూ ఉంటుందన్నారు. పార్టీలో ఎంతటి వారైనా సరే ఆ పరిధిలోనే పనిచేయాలి తప్ప పార్టీలో వర్గాలను పెంచి పోషించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. సిటీలో ఏ సమావేశం జరిగినా దానికి పార్టీ సిటీ అధ్యక్షుడే అధ్యక్షత వహించాల్సి ఉంటుందన్నారు. అంతే తప్ప ఎవరి కార్యాలయంలోనో సమావేశాలు నిర్వహించడం సరికాదన్నారు. కొవ్వూరి శ్రీనివాస్‌ను సిటీ కోఆర్డినేటగా నియమించడానికి బోడ వెంకట్‌కు అధికారం లేదన్నారు. ఇటువంటి నియామకాలను పిసిసి అధ్యక్షురాలు నియమించాల్సి ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీలో ఉన్న అరిగెల అరుణకుమారి కూడా ఆ సమావేశానికి హాజరు కావడం ద్వారా ఏమి సందేశం ఇవ్వాలనుకున్నారని ప్రశ్నించారు. క్రమశిక్షణ కమిటీలో ఉన్న వారు పార్టీలో వర్గవిభేదాలు లేకుండా సమన్వయ పర్చాలని అంతే తప్ప విభేదాలు సృష్టించే విధంగా నిర్వహించిన సమావేశానికి హాజరు కావడం సరికాదన్నారు. ఇప్పుడిప్పుడే బలోపేతం అవుతున్న పార్టీని బలహీన పరిచే విధానాలు అనుసరిస్తూ, రాహుల్‌ని ప్రధాని చేయడానికి, షర్మిలమ్మను సిఎంను చేయడానికి కృషిచేస్తామంటూ ఏవిధంగా ప్రకటనలు చేస్తారని మండిపడ్డారు. గతంలో టికె, తనకు మధ్య వచ్చిన విభేదాలపై పార్టీ అధిష్టానం పిలిపించి మాట్లాడిందని పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని సూచించిందని, ఆమేరకు కలిసి పనిచేస్తున్నామన్నారు. ఇటీవల పార్టీలో పదవుల నియామకానికి పరిశీలకులను పంపించి, వారి నివేదిక మేరకు తనను తిరిగి సిటీ అధ్యక్షునిగా నియమించడం జరిగిందన్నారు. అయితే టికె విషయంలో అన్యాయం జరిగిందన్నారు. టికె జిల్లా అధ్యక్షునిగా పార్టీ కార్యక్రమాల నిర్వహణలో తూర్పుగోదావరి జిల్లాను నెంబర్ 1 స్థానంలో ఉంచారన్నారు. లాబియింగ్ కారణంగానే ఆయనను తప్పించారన్నారు. రాహుల్‌ని ప్రధానిని చేయడానికి, షర్మిలమ్మను సిఎంను చేయడానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణకు షర్మిలమ్మ చేపట్టిన యాత్ర మార్చిలో జిల్లాకు విచ్చేస్తుందని, ఆ యాత్ర జిల్లాలో విజయవంతం చేయడానికి కృషి చేస్తామన్నారు. పిసిసి అనుమతి లేకుండా బోడా వెంకట్ ప్రకటించిన పదవులు చెల్లవని స్పష్టం చేశారు. ప్రత్యేక సమావేశం పెట్టిన వారు తమతో కలిసి పనిచేసిన వారేనని, వారికే గనుక పదవులు కావాలనుకుంటే తమతో కలిసి పనిచేస్తే వారి అర్హత మేరకు పదవుల కొరకు పిసిసికి సిపారస్సు చేస్తామన్నారు. టికె విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పార్టీలో కొందరు అవగాహన రాహిత్యంతో వ్యవహరిస్తున్నారన్నారు. సిటీ అధ్యక్ష, కోఆర్డినేటర్ వంటి పదవులను కేలం పిసిసి మాత్రమే ప్రకటిస్తుందన్నారు. ప్రస్తుతం తాను రాజమహేంద్రవరం పార్లమెంట్ కోఆర్డినేటర్, సిటీ కోఆర్డినేటర్ రెండు పదవుల్లో ఉన్నామన్నారు. పార్లమెంట్ కోఆర్డినేటర్ పదవిలో తనను షర్మిలరెడ్డి నియమించారని, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోని కోఆర్డినేటర్‌లను సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీజీ పేరు లేకుండా చేయడానికి కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. కేంద్రం జీరాంజీ పథకం తీసుకువచ్చి ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నీరు గారుస్తుందన్నారు. గతంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో కేంద్రం 90 శాతం నిధులు ఇచ్చేదని, జీ రాంజీ పథకంలో కేంద్రం 60శాతం మాత్రమే నిధులు ఇస్తుందని, దీని వల్ల రాష్ట్రంపై రూ.5వేల కోట్ల భారం పడుతుందని, ఈ నిధులు రాష్ట్రం పెట్టకుంటే పథకం అమలు కాదన్నారు. షర్మిల యాత్రకు ప్రజలనుంచి మంచి స్పందన వస్తుందన్నారు. మార్చిలో జిల్లాకు షర్మిల యాత్ర వస్తుందని, ఈ య్యాతను విజయవంతం చేయడానికకి కృషి చేస్తామన్నారు. ఈనెల 13న మాజీ ఎంపి జేడి శీలం నగరానికి విచ్చేస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మోతా శారదా మాట్లాడుతూ తాము పార్టీ పట్ల అభిమానంతో పనిచేస్తున్నామే తప్ప పదువుల కోసం కాదన్నారు. పార్టీకి ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతుందని, పార్టీలో గ్రూపులను ప్రోత్సహించడం ద్వారా పార్టీ పటిష్టతను దెబ్బతీయొద్దని సూచించారు. క్రమశిక్షణ కమిటీలో ఉన్న అరిగెల అరుణకుమారి కూడా ఆ సమావేశానికి హాజరుకావడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. విలేకరుల సమావేశలో పార్టీ నాయకులు తడాల కొండలరావు, తాడి సూరిబాబు, బర్రే సుబ్రహ్మణ్యం, బత్తిన చంద్రరావు, ఎస్తేరు రాణి, షేక్ లలిత, సింధియా రాణి, కెవి ఆనంద్‌కుమారి, కె,శారాగ్రేస్, రత్నం వెంకట్రావు, జాలా నటరాజ్, సాకా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారానికి

# తరలివెళ్లిన వార్డు టీడీపీ శ్రేణులు

**రెల్లి జాతిని గుర్తించిన తెలుగుదేశం - నీలాపు వెంకటేశ్వరరావు**


**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శిగా బంగారు నాగేశ్వరరావు నియమితులైన సందర్భంగా 14వ వార్డ్ రెల్లి పేట నుండి తెలుగుదేశం పార్టీ వార్డ్ నాయకులు, యువత,మహిళలు భారీ ఊరేగింపుగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించిన చెరుకూరి కళ్యాణ మండపానికి మోటారు వాహన ర్యాలీగా చేరుకున్నారు. రెల్లి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరిజిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి బొర్రా చిన్ని,మాజీ కార్పొరేటర్ కూరాకుల తులసి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో రెల్లి కులస్తులను గుర్తించి పదవులు ఇచ్చిన చంద్రబాబు,లోకేష్,మా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీకు మా జాతి ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుంది,అలాగే బంగారు నాగేశ్వరరావుకు జిల్లా కార్యదర్శిగా నియమితులు అవ్వడం చాలా గర్వ కారణం అలాగే సంతోషం వ్యక్తం చేస్తున్నాము, ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపు కుంటున్నామని అన్నారు. బంగారు నాగేశ్వరరావు మాట్లాడుతూ నాకు ఇంతటి గొప్ప అవకాశం ఇచ్చిన మా యంగ్ అండ్ డైనమిక్ లీడర్ నగర అభివృద్ధి ప్రదాత మా నాయకులు శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదములు తెలుపుకుంటూ..మా రెల్లి కులస్తులకు,మా అభిమానులకు,స్నేహితులకు వార్డు ప్రజలకు అందరికీ నా నమస్సులు తెలుపుకుంటున్నాను. బంగారు నాగేశ్వరరావు నియామకం పట్ల పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్యాల దుర్గాప్రసాద్, కారంగి వీర్రాజు, కరణం లక్ష్మీ నాయుడు,రెల్లి శ్రీనివాసరావు,రామకృష్ణ, మల్లెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నగరంలో గత మూడు రోజులుగా ఆహార భద్రతా అధికారులు, లీగల్ మెట్రోలజీ అధికారులు జాయింట్‌గా తనిఖీలు నిర్వహించారు. 10 మంది ఆహార భద్రతా అధికారులు మరియు లీగల్ మెట్రోలజీ ఇన్స్పెక్టర్స్ కలిసి 5 టీంలు గా ఏర్పడి సుమారు 30 ఆహార పదార్థాలు అమ్మే యూనిట్ల పై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ముఖ్యశీగా హోటళ్ళు, రెస్టారెంట్లు, బిర్యాని సెంటర్లు, స్వీట్ షాపులు, స్వీట్ తయారీ కేంద్రాలు, బేకరీలను తనిఖీ చేసారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టాము (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006) కింద వివిధ కేసులను నమోదు చేశారు. అందులో

1) 20 ఆహార పదార్థముల శాంపిల్లను స్టేట్ ఫుడ్ లేబరటరీ, హైదరాబాద్ కు పంపించారు. ఇందులో చికెన్ బిర్యానిలు, చికెన్ ఫ్రై, వంటకు వాడే వంట నూనెలు, యందు జంతు కళేబరాలు నుండి సేకరించిన వంట నూనెలు ఉన్నాయనే అనుమానంతో శాంపిలళ్లు ప్రయోగ శాల కు నిర్ధారణ కై పంపితిరి స్వీట్ల తయారీ లో కృత్రిమ రంగులు వాడుతున్నారనే దాని పై నిర్ధారణ కు శాంపిళ్ల ను సేకరించిరి.

2) కుళ్ళి పోయిన మాంసము, మసాలా పేస్టలు, వండి నిల్వయుంచిన మాంసాహార పదార్థములను సీజు చేసి డిస్ట్రాయ్ చేసితిరి. కేసులు నమోదు చేసితిరి. సుమారు 174 కేజీ లు ఆహార పదార్థములు రూ. 62000/- విలువ చేసేదానివి వినియిగమునకు పనికి రానందు న నిర్వీర్యం చేసితిరి.

3) స్టోర్ రూమ్ లలో ఎక్స్పైర్ అయిన ఫుడ్స్ మరియు నిషేధిత రంగులు పాడై పోయిన గుడ్లు, బేకరీ ఐటమ్స్ ను సీజు చేసితిరి



4) న్యూస్ పేపర్ల తో బ్రెడ్, కేక్ లు, తయారు చేయుచున్నట్లు గా గుర్తించి వాటిని సీజు చేసితిరి ఫుడ్ సాంపిల్స్ విశ్లేషణ రిపోర్టులు వచ్చిన పిదప సంబందిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ పై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ , 2006 మరియు రెగ్యులేషన్లు, రూల్స్ ప్రకారం తదుపరి చర్యలు తీసుకొనబడును. ఈ తనిఖీలలో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు పాల్గొన్నారు.

# వ్యక్తిగత శుభ్రత, కళాశాల పరిసరాలను శుభ్రం చేసుకోవాలి

**ధవళేశ్వరం కళాశాలలో శుభ్రత - పరిశుభ్రత కార్యక్రమం**



**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు నేడు విద్యార్థులు "కళాశాల శుభ్రత - పరిశుభ్రత " కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు అంతా తరగతి గదులను అలాగే కళాశాల మైదానాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఇన్ ఛార్జీ ప్రిన్సిపాల్ ఏ. వెంకట రమణ మాట్లాడుతూ మన వ్యక్తిగత శుభ్రత తోపాటు మన పరిసరాలను, కళాశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని విద్యార్థులను కోరారు." మన ఆరోగ్యం -మన భాగ్యం"అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు- ఎస్కే. అలీముద్దీన్, వి.ఎస్. శేఖర్ బాబు,వై.శివకుమారి, సి.శాంతి సుధ, కె.ఉమాశంకర్, డి.భాస్కరరావు,ఎన్. కళ్యాణిదేవి,ఏ.జ్యోతి తదితరులు మరియు ఆఫీసు సిబ్బంది, విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

నాట్య కళాతరంగిణి సంగీత నృత్యోత్సవంలో

# డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ సత్కారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో స్థానిక ఆనం కళాకేంద్రంలో నీర్వహించిన నాట్య కళా తరంగిణి సంగీత నృత్యోత్సవం కార్యక్రమం లో ముఖ్య అతిధిగా టీడీపీ యువ నాయకులు ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.గోరంట్ల రవిరామ్ కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ నాట్యచారిణి గాయత్రి పట్నాయక్ ఆధ్వర్యంలో గత రెండు రోజులగా నిర్వహిస్తున్న సంగీత నృత్యోత్సవం కార్యక్రమానికి ఆహ్వానించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. నేడు నృత్యం ప్రదర్శించిన చిన్నారులకు, పెద్దలకు, అందరికి అభినందనలు తెలియజేస్తూ. సాంస్కృతిక, కార్యక్రమాలకు కళలకు,పుట్టినిల్లు మన రాజమహేంద్రవరం ఇక్కడి ఆనం కలకేంద్రం ఆడిటోరియం నుండి ఎంతో మంది ప్రతిభవంతులు నేడు సినిమా రంగాల్లో, కళల రంగాల్లోను గొప్ప స్థాయిలో ఉన్నారని నేడు చిన్నారులు కూడా ఉన్నత స్థాయి కీ ఎదగాలని కోరుకుంటున్నా అని రవి రామ్ కిరణ్ అన్నారు నేటి సమాజంలో పాశ్చాత కళలును ప్రోత్సహిస్తు మన సాంస్కృతిని,దూరం చేసుకుంటున్నామని మన కళలకు, సంప్రాదాయాలకు, విలువలు నిస్తూ పిల్లలకు నృత్యం,మరియు సంగీతంలోనూ,శిక్షణ ఇప్పిస్తున్న పిల్లల తల్లిదండ్రులకు, కళారంగాన్ని ప్రోత్సహిస్తిన్నా గురువులకు ధన్యవాదములు తెలియజేస్తు ఇటువంటి కార్యక్రమాల్లో మా గోరంట్ల శాంతరావు ఫౌండేషన్ ప్రోత్సాహం ఉంటుందని తెలియజేయడం జరిగింది. అనంతరం గాయత్రి పట్నాయక్ కళా బృందం వారు సాలువాతో సత్కారించి సన్మానం నిర్వహించి జ్ఞపికను అందజేయడం జరిగింది.

# రాజానగరంలో మెగా జాబ్ మేళాలో ఆదిత్య కాలేజీల వాలంటీర్ల సేవలు




**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో రాజమండ్రి ఆదిత్య కాలేజీల ఎన్ఎస్ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు స్వచ్ఛంద సేవలు అందించారు. ఉదయం నుండి సాయంత్రం 5 గంటల వరకు వాలంటీర్లు కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు పాల్గొన్న అభ్యర్థులకు మార్గదర్శనం చేయడంతో పాటు వివిధ విభాగాలలో సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో డా. జి.వి.ఎస్. నాగేశ్వరరావు, పోలుకొండ సాయి,బి. విమల,డా. బి.వి. రమాదేవి,వాలంటీర్ల సేవలను అభినందించారు.

క్రీడా వాయిస్

# 610 రోజుల పగ తీర్చిన కివీస్..

## వడ్డీతో సహా ఇచ్చిపడేశారుగా..




2 ఏళ్ల ప్రతీకారాన్ని తీర్చుకున్న న్యూజిలాండ్ జట్టు.. 5 వికెట్ల తేడాతో ఆఫ్ఘాన్ జట్టును మట్టికరిపించింది. దీంతో 2026 టీ20 ప్రపంచకప్ ను విజయంతో ప్రారంభించింది. ఈ క్రమంలో సీఫెర్ట్, గ్లెన్ ఫిలిప్స్ ల కీలక ఇన్నింగ్స్ తో రాణించడంతో కివీస్ విజయం సులభమైంది. ఎట్టకేలకు న్యూజిలాండ్ 2024 ప్రపంచ కప్‌లో తమ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. అఫ్గానిస్తాన్ రెండేళ్ల క్రితం 2024 టీ20 ప్రపంచ కప్ లో న్యూజిలాండ్ జట్టును 75 పరుగులకే కట్టడి చేసింది. దీంతో 84 పరుగుల తేడాతో కివీస్ పై ఘన విజయం సాధించింది. 2026 టీ20 ప్రపంచకప్ లో గ్రూప్ డీలో భాగంగా జరిగిన మ్యాచ్ లో టిమ్ సీఫెర్ట్, గ్లెన్ ఫిలిప్స్ ల అద్భుతమైన ఇన్నింగ్స్ తో ప్రతీకారం తీర్చుకుంది. 5 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్ జట్టును మట్టికరిపించి విజయంతో న్యూజిలాండ్ ఈ టోర్నీని మొదలుపెట్టింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘాన్ జట్టు 183 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం న్యూజిలాండ్ జట్టు 17.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టపోయి ఈ లక్ష్యాన్ని చేరుకుంది.ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ 42 బంతుల్లో 65 పరుగులు చేశాడు. గ్లెన్ ఫిలిప్స్ 42 పరుగులు జోడించగా, మార్క్ చాప్మన్ 17 బంతుల్లో 28 పరుగులు చేశాడు. డారిల్ మిచెల్ 14 బంతుల్లో 25 పరుగులు, కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 8 బంతుల్లో 17 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఫిన్ అలెన్ ఒక పరుగుకు ఔటయ్యాడు. రాచిన్ రవీంద్ర గోల్డెన్ డక్‌గా ఔటయ్యాడు.

### గుల్బాదిన్ నయీబ్ హాఫ్ సెంచరీ..

ఆఫ్ఘాన్ తరపున గుల్బాదిన్ నాయిబ్ హాఫ్ సెంచరీ చేశాడు. దీంతో ఆఫ్ఘాన్ 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. గుల్బాదిన్ (63 పరుగులు, 35 బంతులు), సెదికుల్లా అటల్ (29 పరుగులు, 24 బంతులు) మూడో వికెట్‌కు 51 బంతుల్లో 79 పరుగులు జోడించారు. కానీ, నెమ్మదిగా ఉన్న పిచ్‌పై పరుగులు సాధించడం కష్టంగా అనిపించింది. ఫెర్గూసన్ ఆరో ఓవర్ చివరి బంతికి గ్లెన్ ఫిలిప్స్‌కు క్యాచ్ ఇచ్చి ఓపెనర్ ఇబ్రహీం జాద్రాన్ (10)ను ఔట్ చేశాడు. గుల్బాదిన్ 29 బంతుల్లో తన అర్ధ సెంచరీని చేరుకున్నాడు. ఫాస్ట్ బౌలర్ జాకబ్ డఫీ బౌలింగ్‌లో అతను రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదాడు. గుల్బాదిన్, దర్వేష్ రసూలి (20 పరుగులు, 13 బంతులు) 17 బంతుల్లో 33 పరుగులు జోడించి ఆఫ్ఘనిస్తాన్ స్కోరును 150 దాటించారు. ఆ తర్వాత 18వ ఓవర్లో పార్ట్ టైమ్ స్పిన్నర్ రచిన్ రవీంద్ర బౌలింగ్‌లో గుల్బాదిన్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఇది చివరి ఓవర్లలో ఆఫ్ఘనిస్తాన్ రన్ రేట్‌ను ప్రభావితం చేసింది. అజ్మతుల్లా ఉమర్జాయ్ (14) రెండు సిక్సర్లు కొట్టి జట్టు స్కోరును 180 దాటించాడు.

# భారత్, పాక్ మ్యాచ్‌పై కొత్త ట్విస్ట్..




భారత్ - పాకిస్థాన్ టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ విషయంలో ఏర్పడిన వివాదంలో బంగ్లాదేశ్ అనూహ్యంగా జోక్యం చేసుకుంది. దీంతో ఐసీసీ జం పీసీబీగా మారిన ఈ వివాదం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. ఈరోజు లేదా రేపు ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడేలా కనిపిస్తోంది. అంటే భారత్, పాక్ జరిగేలా కనిపిస్తోంది. ఫిబ్రవరి 15న భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్థాన్ ఇప్పటికే నిర్ణయించుకుంది. దీంతో ఈ నిర్ణయం ప్రస్తుతం 2026 టీ20 వరల్డ్‌కప్ మొదలయ్యాక మరోసారి ఉత్కంఠభరితంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం బుల్బుల్ కీలక సమావేశం కోసం లాహోర్‌కు వెళ్లాడు. బీసీబీ - పీసీబీ మధ్య జరగనున్న సమావేశానికి ఇద్దరు ఐసీసీ అధికారులు కూడా లాహోర్‌కు వెళ్తున్నారు. భద్రతా కారణాలు చూపిస్తూ, గ్రూప్ దశ మ్యాచ్‌ల కోసం భారతదేశానికి తమ జాతీయ జట్టును పంపేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ మద్దతుతో) నిరాకరించింది. టోర్నమెంట్ సహ-ఆతిథ్య దేశమైన శ్రీలంకకు తమ మ్యాచ్‌లను మార్చాలని బీసీబీ అధికారికంగా ఐసీసీని కోరింది. అయితే, స్వతంత్ర భద్రతా సమీక్షలో ఎలాంటి ప్రత్యేక ముప్పు లేదని తేలడంతో, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. జనవరి చివర్లో పాల్గొనాల్సిన గడువు మిస్ కావడంతో, ఐసీసీ బంగ్లాదేశ్‌ను ఈ ద్వైవార్షిక టోర్నమెంట్ నుంచి తప్పించి, గ్రూప్-సీలో స్కాట్లాండ్‌ను చేర్చింది.

### పాకిస్థాన్ జోక్యంతో వివాదం..

పాకిస్థాన్ ప్రభుత్వం, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) బంగ్లాదేశ్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించాయి. ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్‌ను బహిష్కరించాలని జాతీయ జట్టుకు ఆదేశించినట్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ధృవీకరించిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌ను టోర్నమెంట్ నుంచి తప్పించడం "అన్యాయం", "రాజకీయ ప్రేరేపిత నిర్ణయం" అని పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నక్వీ విమర్శించారు. భద్రతపై అనుమానాలు ఉన్న చోట ఆడమని ఏ క్రికెట్ బోర్డుపై ఒత్తిడి తేవడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. బుల్బుల్ - నక్వీ సమావేశం ప్రస్తుత గొడవకు ఫుల్ స్టాప్ పెట్టడమే లక్ష్యంగా జరగనుంది. ఆ తర్వాత ఇరు దేశాల బోర్డులు కలిసి ఐసీసీ అధికారులతో సమావేశమై ఏకాభిప్రాయంతో తమ వాదనను వినిపించనున్నట్లు తెలుస్తోంది. క్రికెట్ ప్రపంచం మొత్తం ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తోంది. టోర్నమెంట్‌లో అత్యంత భారీ వాణిజ్య విలువ కలిగిన భారత్ - పాకిస్థాన్ మ్యాచ్‌కు కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, టోర్నమెంట్ ప్రతిష్టకు భంగం కలగకుండా అన్ని పక్షాలను సంతృప్తిపరిచే పరిష్కారం కనుగొనాల్సిన ఒత్తిడి ఐసీసీపై భారీగా ఉంది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించే ప్రణాళికను కొనసాగిస్తే తీవ్ర శిక్షలు తప్పవని ఐసీసీ ఇప్పటికే పీసీబీని హెచ్చరించింది. భారీ ఆర్థిక జరిమానాలు, పాయింట్ల కోల్పోవడం నుంచి భవిష్యత్తు అంతర్జాతీయ టోర్నమెంట్‌ల ఆతిథ్య హక్కులు కోల్పోవడం వరకు, అవసరమైతే బోర్డు సభ్యత్వాన్ని కూడా నిలిపివేసే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది.

### వైఖరి మార్పుపై ఐసీసీ ఆశలు..

ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా కూడా కొలంబోకు వెళ్లి శ్రీలంక క్రికెట్ బోర్డు అధ్యక్షుడు షమ్మీ సిల్వాను కలిశారు. షమ్మీ సిల్వానే భారత్‌తో వరల్డ్‌కప్ మ్యాచ్ ఆడాలని పీసీబీ చైర్మన్ నక్వీకి ఈమెయిల్ పంపినట్లు సమాచారం. 'ఫోర్స్ మేజ్యూర్' నిబంధనను ఆధారంగా చూపిస్తూ భారత్‌తో టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ ఆడకపోవడానికి పాకిస్థాన్ ప్రయత్నించడంపై ఐసీసీ ఇప్పటికే వివరణ కోరింది. ప్రభుత్వంపై బాధ్యత నెట్టివేసి పీసీబీ ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవాలని ప్రయత్నించిందని ఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే, తాజా సమాచారం ప్రకారం పీసీబీ చర్చల కోసం ఐసీసీని సంప్రదించడంతో కొంత ఆశ కనిపిస్తోంది. చివరకు ఆ 'మార్కీ క్లాష్' (భారత్ - పాకిస్థాన్ మ్యాచ్) జరుగుతుందని ఒక ఐసీసీ డైరెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



సినీ వాయిస్ CINEMA

# ఒకే ఒక్క యాడ్‌తో నేషనల్ వైడ్ క్రేజ్..

### 'బరాబర్ ప్రేమిస్తా' హీరోయిన్ బ్యాక్‌గ్రౌండ్ ఇదే




ఈటీవీ ప్రభాకర్ కుమారుడు చంద్రహాస్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా 'బరాబర్ ప్రేమిస్తా' . ఈ శుక్రవారం (ఫిబ్రవరి 06) ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా హిట్ టాక్ తెచ్చుకుంది. ఇందులో హీరోతో పాటు హీరోయిన్ నటనకు కూడా మంచి మార్కులు పడుతున్నాయి. సోషల్ మీడియాలో 'యాటిట్యూడ్ స్టార్'గా గుర్తింపు తెచ్చుకున్న చంద్రహాస్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా 'బరాబర్ ప్రేమిస్తా'. చంద్రహాస్ పాడిన పాటతో రిలీజ్ కు ముందే ఈ సినిమా వార్తల్లో నిలిచింది. నెగెటివ్ బజ్ తో శుక్రవారం (ఫిబ్రవరి 08) ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు థియేటర్లలో పాజిటివ్ బజ్ కనిపిస్తోంది. చాలా మంది ఈ సినిమాను చూసి పాజిటివ్ రివ్యూలు ఇస్తున్నారు. హీరో, హీరోయిన్లు చాలా బాగున్నారని, క్లైమాక్స్ అద్భుతంగా ఉందని ప్రశంసలు కురిపిస్తున్నారు. సంపత్ రుద్ర తెరకెక్కించిన 'బరాబర్ ప్రేమిస్తా' సినిమాలో మేఘనా ముఖర్జీ హీరోయిన్ గా నటించింది. అలాగే అర్జున్ మహీ, మురళీధర్ గౌడ్, మధునందన్, మీసాల లక్ష్మణ్, అభయ్ నవీన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ లవ్ స్టోరీలో హీరోయిన్ మేఘన స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. సినిమాలో ఆమె లుక్స్, యాక్టింగ్ కు ఆడియెన్స్ ఫిదా అవుతున్నారు. మరి అసలీ ఎవరీ మేఘనా ముఖర్జీ? ఆమె బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? అని నెటిజన్లు సెర్చ్ చేయగా ఆమె గురించి పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి. మేఘనా ముఖర్జీది పశ్చిమ బెంగాల్. కోల్‌కతాలో జన్మించిన ఈ బ్యూటీ.. ముంబైలో పెరిగింది. చదువుకునే సమయంలోనే మోడల్ గా కెరీర్ ప్రారంభించింది. టైటాన్, పాంటలూన్స్ వంటి ఫేమస్ బ్రాండ్లకు అంబాసిడర్ గా వ్యవహరించింది. అయితే రెండేళ్ల క్రితం ఒక యాడ్ లో టీమిండియా మాజీ క్రికెటర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీతో కలిసి నటించిందీ అందాల తార. ప్రముఖ బిస్కెట్ & బేకరీ బ్రాండ్‌లలో ఒకటైన బిస్క్ ఫామ్ కోసం చేసిన ఈ యాడ్ అప్పట్లో బాగా వైరల్ అయ్యింది. ముఖ్యంగా గంగూలీ, మేఘనా కలిసి చేసిన ఫొటోషూట్ ఫిక్స్ నెట్టింట బాగా ట్రెండ్ అయ్యాయి.

# కటౌట్ అదిరింది భయ్యా..

### డ్రాగన్ లుక్‌లో ఎన్టీఆర్.. న్యూస్టైల్ చూసి ఫ్యాన్స్ ఫిదా..

దేవర తర్వాత ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ కోసం కష్టపడుతున్నారు పాన్ ఇండియా స్టార్ జూనియర్ ఎన్టీఆర్. వీరిద్దరి కాంబోలో రాబోయే సినిమాకు డ్రాగన్ అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు ప్రచారం నడుస్తుంది. మరోవైపు ఈ సినిమా షూటింగ్ కొన్ని నెలలుగా జరుగుతుంది. ఈ క్రమంలోనే తాజాగా ఎన్టీఆర్ న్యూలుక్స్ అందరిని కట్టిపడేస్తున్నాయి. పాన్ ఇండియా స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. భారీ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ హీరోయిన్ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. ఆర్ఆర్ఆర్, దేవర తర్వాత ఎన్టీఆర్ నటిస్తోన్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ రా యాక్షన్ తో రాబోయే సినిమా పై దేశవ్యాప్తంగా భారీ హైప్ నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ఎన్టీఆర్ కు సంబంధించి ఓ లేటేస్ట్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతుంది. హైదరాబాద్ ఎయిర్ పోర్టులో కనిపించిన తారక్ లుక్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. స్లిమ్ ఫిట్ బాడీ, లాంగ్ బియర్డ్, చెవికి రింగ్, బ్లూ జీన్స్ విత్ హుడ్డీతో మరింత స్టైలిష్ గా కనిపిస్తున్నారు. ప్రస్తుతం తారక్ న్యూలుక్ చూసి డ్రాగన్ ఫైనల్ లుక్ ఇదే అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ న్యూలుక్ ఫోటోస్, వీడియోస్ తెగ వైరలవుతున్నాయి. ఓవైపు డ్రాగన్ షూటింగ్ వేగంగా జరుగుతుండగా.. ఈ సినిమా గురించి నిత్యం ఏదోక విషయం నెట్టింట వైరలవుతుంది. తాజాగా ఎన్టీఆర్ న్యూ వీడియో చూస్తుంటే డ్రాగన్ తాజా షెడ్యూల్ ను విదేశాల్లో ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ లొకేషన్ హైదరాబాద్ నుంచి జోర్డాన్ కు షిఫ్ట్ చేశారని సమాచారం.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com